# శూద్రులకు సుద్దులు

## (మీ గతమిది, మీ మతమేది)

శ్రీ పెందుర్తి శంకరరావు

# శూద్రులకు సుద్దులు

## (మీ గతమిది, మీ మతమేది)

శ్రీ పెందుర్తి శంకరరావు

# శూద్రులకు సుద్దులు

## (Sudrulaku Suddulu)

by

శ్రీ పెందుర్తి శంకరరావు

పబ్లిషర్ : శ్రీ పెందుర్తి శంకరరావు,

గాంధీనగర్, విజయవాడ, కృష్ణాజిల్లా-520003, ఆంధ్రప్రదేశ్.

E-mail : sudrulakusuddulu@gmail.com (ప్రతులకు)
pendurthisankarrao@gmail.com

Printed Copies : 1000 copies

© Copyright Reserved

First Edition - 2016

హెచ్చరిక : ఈ పుస్తకం మార్కెట్‌లో వున్నంతవరకు ఏ అంశాన్నైనా, ఏ రూపంలోనైనా ముందుగా ప్రచురణకర్త & కాపీరైట్ హోల్డరు నుండి, లిఖితపూర్వక అనుమతి పొందకుండా వాడుకోవడం కాపీరైట్ చట్టప్రకారం నేరం.

# విషయ సూచిక


| | | పేజి |
|---|---|---|
| ప్రస్తావన | - | 1-3 |
| అధ్యాయము - 1 (విశ్వం) | - | 4-6 |
| అధ్యాయము - 2 (సూర్యుడు, భూమి, చంద్రుడు) | - | 7-9 |
| అధ్యాయము - 3 (భూమి) | - | 10-13 |
| అధ్యాయము - 4 (భూమిపై మానవ సంచారము, నాగరికతలు) | - | 14-16 |
| అధ్యాయము - 5<br>(భారత ఉపఖండములో మానవ సంచారము - నాగరికత) | - | 17-18 |
| అధ్యయము - 6<br>(హిందూ దేశము - ద్రావిడ, ఆర్య సంస్కృతులు - వర్ణ వ్యవస్థ) | - | 19-28 |
| అధ్యాయము - 7 (హిందూ మతము - వేదములు - మతగ్రంథాలు) | - | 29-46 |
| అధ్యాయము - 8 (హిందువులు - దేవుళ్ళు) | - | 47-58 |
| అధ్యాయము -9 (హిందూమతము - మరికొన్ని విషయాలు) | - | 59-65 |
| ఉపసంహారమా! కాదు ప్రారంభము | - | 66-68 |

:: అంకితం ::

తరతరాలుగా భారతదేశములో
మతపరముగా అణగద్రొక్కబడిన
ప్రజలకు

# ప్రస్తావన

మన భారతదేశపు నాగరికత ప్రపంచములోనే అతి పురాతనమైనది అని మన మేధావులు చెబుతారు. మనకంటే తక్కువ చరిత్ర గలిగిన దేశాలు, నాలుగు వందల సం॥ముల చరిత్ర గలిగిన అమెరికా చాలా అభివృద్ధి చెందివున్నాయి. మనమైతే చాలా వెనుకబడియున్నాము. ఎందుకు?

కారణము – "**అవిద్య**"

మన జనాభాలోనున్న సగం మంది స్త్రీలకు, తొంబది శాతముగా నున్న శూద్రులకు – 150 తరాలుగా విద్యలేదు. దీనికి బాధ్యులు ఎవరు? – బ్రాహ్మణులే కదా!.

మన దేశములో నున్న మతము – హిందూ మతము కాదు – ఇది బ్రాహ్మణ అభిమతము.

ఈ మతానికి పునాది

**(1) వర్ణవ్యవస్థ** – బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు.

**(2) కర్మ సిద్ధాంతము** – ఇంగ్లీషులో "ఫేట్" నుదుటి పై రాత.
ఎవరికి ఎంత ప్రాప్తమో అంతే లభ్యం.

**(3) పునర్జన్మ సిద్ధాంతము** – ద్విజులైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు మొదట యోని నుండి పుట్టారు. తర్వాత ఉపనయనము (జందెము ధరించడం) ద్వారా రెండవ జన్మ ఎత్తుతారు. అందుకే వీరు చనిపోయాక స్వర్గానికే వెళ్ళిపోతారు. శూద్రులు ద్విజులు కారు, కాబట్టి అనేక జన్మలు ఎత్తుతారు.

పై మూడు సిద్ధాంతాలు బ్రాహ్మణ మతానికి చాలా బలమిస్తున్నాయి. ఈ సిద్ధాంతాలను స్త్రీలు, శూద్రులు పై రుద్ది, వారి తలలలో బలంగా నాటారు. వారిలో

భయము పుట్టించి, తమ చెప్పుచేతల్లో వుంచుకొని, ఊడిగం చేయించుకొని అగ్రవర్ణాలవారు స్వార్థముతో తమ పబ్బము గడుపు కొన్నారు.

మను, పరాశర, వేదవ్యాస తదాది స్మృతులను సృష్టించి స్త్రీలపై, శూద్రులపై అనేక ఆంక్షలు విధించారు. అందులో ముఖ్యమైనది – వారు **చదువుకోకూడదు.**

దేశ జనాభాలో ఇంతమంది ప్రజలకు విద్య లేకుండా చేసి, మూఢ నమ్మకాలకు, మూఢ మతాచారాలకు, మూఢ సాంప్రదాయాలకు గురి చేసినందు వలన మన భారతదేశము ఇంకా వెనుకబడేయున్నది.

ఈ పరిస్థితి 150 తరాలుగా వుండగా మన దేశము, బ్రిటిషు వారి ఏలుబడి వచ్చాక, క్రీ॥శ॥ 1800 సం॥ముల తర్వాత నెమ్మదిగా మారసాగింది. మొదటగా క్రైస్తవ మిషనరీలు స్త్రీలకు, శూద్రులకు, నిమ్నజాతివారికి "చదువు" చెప్పనారంభించారు. తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం స్కూల్లు, కాలేజీలు, యూనివర్సిటీలు నెలకొల్పి, దేశ ప్రజలందరికీ చదువుకొనే అవకాశము కల్పించారు. ఈ అవకాశాన్ని కూడా అగ్రవర్ణాలు వారే ఎక్కువగా అందిపుచ్చుకున్నారు.

బ్రాహ్మణులు ఇంకో నిర్వాకము చేశారు. శూద్రులను 2000 కంటే ఎక్కువ కులాలుగా విభజించారు. కొన్ని కులాలను నీచమైన పనికి ఉపయోగించి వారిని "పంచములు" గా ముద్రవేసి అంటరాని వారిగా పరిగణించారు. ఈ విధముగా శూద్రులను అగ్రకులాలుగా, వెనుకబడిన కులాలు గా, అంటరాని కులాలుగా విభజించి వారిలో వారికి తగువుపెట్టారు. ఈ పరిస్థితి నేటికీ, రోజు రోజుకూ పెచ్చరిల్లి దేశము కొట్టుమిట్టాడుతున్నది.

శూద్రులలో అగ్రకులాలు (వెలమ, కమ్మ, రెడ్డి, తెలగ, కాపు, మొ॥) వారు దేశ సంపదను స్వంతము చేసుకున్నారు. ఇప్పుడు ఈ అగ్రకులాలు బ్రాహ్మణులను మించిపోయి – బ్రాహ్మణ మతాన్ని గుడ్డిగా అనుసరించి పూజలు, యజ్ఞయాగాదులు, ఊరేగింపులు, మేళాలు, పుష్కరాలు, **శంకుస్థా**పనలు, పండుగలు, పబ్బాలు, జాతరలు జరుపుతున్నారు. వీటన్నిటి వెనుక **బ్రాహ్మణులే** వుండి నడిపిస్తున్నారు.

ఇంత జరుగుతున్నా ఒక కాంతిరేఖ అణగారిన ప్రజలకు ఆశాజ్యోతిగా వున్నది. అదే "విద్య".

బ్రిటిష్ వారి పుణ్యాన, మిషనరీల ధర్మాన, గత నాలుగైదు తరాలుగా శూద్రులు, స్త్రీలు, నిమ్నజాతివారు విద్య నభ్యసించి అన్ని రంగాలలో రాణిస్తున్నారు. కొందరైతే బ్రాహ్మణులను మించిపోయారు.

నాలుగైదు తరాలకే ఇంత మార్పు వస్తే, నూరు తరాలుగా విద్య నభ్యసించి వుంటే నేటి పరిస్థితి ఏలాగుండేదో ఆలోచించండి.

ఈ చిన్న పుస్తకములోని విషయాలు - హిందూ మత గ్రంథాలు నుండి, పరిశోధకుల పరిశోధనల నుండి, శాస్త్రవేత్తల విజ్ఞాన గ్రంథాలు నుండి, గూగుల్ అందిస్తున్న సమాచారము నుండి గ్రహింపబడినవి.

ఈ పుస్తకములోని నిజాలు గ్రహించి మానసిక బానిసత్వము నుండి, మతమౌఢ్యము నుండి బయటపడండి. హేతువాదులుగా ఆలోచించండి. మేల్కొనండి.

మీ శ్రేయోభిలాషి

హేతువాది.

శ్రీ పెందుర్తి శంకరరావు

# అధ్యాయము - 1

## విశ్వం

క్రీస్తు పూర్వము అనేక సంవత్సరములు నుండి నేటి వరకు ఖగోళ శాస్త్రజ్ఞులు, ఆకాశము, నక్షత్రములు, గ్రహములు, తోకచుక్కలు, ఉల్కలు గురించి అధ్యయనము చేస్తూ అనేక విషయములు ఈ విధముగా తెలియజేస్తున్నారు.

విశ్వము గురించి తెలుసుకోవాలంటే సమయము, దూరము, కాంతివేగము గురించి తెలుసుకోవాలి.

భూమి తన కక్ష్యలో సూర్యుని చుట్టూ ఒకసారి తిరుగుటకు 365 రోజులు పడ్తుంది. అది ఒక సంవత్సరం. తనలో తాను తిరుగుటకు 24 గంటలు పడ్తుంది. అది ఒక రోజు. గంటకు 60 నిమిషములు. నిమిషమునకు 60 సెకండ్లు.

దూరాన్ని ఇంచీలు, అడుగులు, గజములు, ఫర్లాంగులు, మైళ్ళలో లేక మీటర్లు, కిలోమీటర్లలో నిర్ణయిస్తాము. కాంతి ఒక సెకను కాలములో ఒక లక్ష ఎనభై ఆరువేల మైళ్ళు దూరము ప్రయాణిస్తుంది. ఆలాగున కాంతి, ఒక సంవత్సరకాలములో ప్రయాణించే దూరాన్ని ఒక కాంతి సంవత్సరము అంటారు. ఒక కాంతి సంవత్సరము దూరము = 1,86,000 మైళ్ళు × 60 సెకనులు × 60 నిమిషములు × 24 గంటలు × 365 రోజులు.

సూర్యున్నుండి భూమికి కాంతి 8 నిమిషముల 20 సెకండ్లలో చేరుతుంది. దీన్ని బట్టి సూర్యున్నుండి భూమి ఎంత దూరములో ఉందో లెక్కవేయవచ్చు. విశ్వము, విశ్వాంతరాలను గురించి తెలుసుకోవాలంటే కాంతి సంవత్సరములలో లెక్కలేసుకోవాలి. ఇదే నేటి శాస్త్రజ్ఞులు పాటించే పద్ధతి.

**విశ్వము :-** విశ్వము అనంతము. ఇది అనేక గెలాక్సీల సముదాయము. ఒక గెలాక్సీలో కోట్ల సంఖ్యలో నక్షత్రాలుంటాయి. చిన్న గెలాక్సీలో ఒక కోటి నక్షత్రాలుంటాయి. పెద్ద గెలాక్సీలో లక్ష కోట్లు నక్షత్రాలుంటాయి. ఈ గెలాక్సీలు వివిధ రూపాల్లో ఉంటాయి. ఒక్కో నక్షత్రానికి ఒక మండలముంటుంది. అందులో గ్రహాలు, ఉపగ్రహాలు, తోకచుక్కలు, ఉల్కలు, ధూళి ఉంటాయి. సూర్యుడు ఒక నక్షత్రము, సూర్య మండలములో భూమి ఒక గ్రహము.

మన భూమి నుండి హబుల్‌టెలిస్కోప్ వంటి పరికరములతో పదివేలకోట్ల గెలాక్సీలు పరిశీలించగలమని శాస్త్రజ్ఞుల అంచనా. అంటే ఇంకా అసంఖ్యాక గెలాక్సీలున్నాయి. అవి మన ఊహకు అందవు.

విశ్వము యొక్క వైశాల్యము అనంతము. విశ్వములో నున్న ప్రతి గెలాక్సీ, నక్షత్రము, గ్రహము, ఉపగ్రహము, తోకచుక్కలు వాటిలో అవి భ్రమిస్తూనే వాటి కక్షలో అవి దూసుకుపోతూ ఉంటాయి. వాటి భ్రమణములో తేడా వస్తే అవి గతి తప్పి, గెలాక్సీతో గెలాక్సీ, నక్షత్రముతో నక్షత్రము, గ్రహముతో గ్రహము, లేక తోకచుక్కలు లేక ఉల్కలుతో ఢీకొడ్తాయి. అటు తర్వాత క్రొత్త గెలాక్సీలు, నక్షత్రాలు, గ్రహాలు ఏర్పడుతాయి.

కొన్ని నక్షత్రాలు లయమయి పోయి వాటి స్థానములో కృష్ణబిలాలు (బ్లాక్‌హోల్స్) ఏర్పడుతాయి. వాటి సమీపములోకి ఏ వస్తువు (కాంతితో సహా) వచ్చినా వాటిని మింగేస్తాయి. సూర్యుడు కూడా భవిష్యత్‌లో కృష్ణబిలముగా మారిపోవచ్చు.

ఈ రోజు మనము చూస్తున్న గెలాక్సీలు, నక్షత్రాలు, గ్రహాలు వుండవచ్చు, వుండకపోవచ్చు. ఎందుకనగా వాటి కాంతి అనేక లక్షల, కోట్ల సంవత్సరముల క్రితము నుండి ప్రయాణించి మనకు చేరుతుంది.

మన సూర్యమండలము (సౌరవ్యవస్థ) ఉన్న గెలాక్సీ పేరు "పాలపుంత" (మిల్కీ వే). ఇది 1320 కోట్ల సంత్సరముల క్రితం ఏర్పడింది. దీపావళిలో కాల్చే విష్ణు చక్రం రూపంలో వుంది. దీని వ్యాసము 120 వేల కాంతి సంవత్సరములు. దీని మందము 2 వేల కాంతి సంవత్సరములు. పాలపుంతలో 40 వేల కోట్ల నక్షత్రాలుంటాయి అని అంచనా.

పాలపుంత మధ్యనుండి 27000 కాంతి సంవత్సరముల దూరములో మన సూర్య మండలమున్నది. సూర్యునికి సమీపములో నున్న నక్షత్రము "ప్రోక్షిమాసెంటారి" వీటి మధ్యనున్న దూరము 4 1/4 కాంతి సంవత్సరాలు.

సప్తర్షి మండలములో 7 నక్షత్రాలున్నాయి. వాటికి సమీపముగా "అరుంధతి" నక్షత్రమున్నది. ఈ నక్షత్రాలు కొన్ని సూర్యుని కన్నా పెద్దవి. కొన్ని చిన్నవి. ఇవి సూర్యునికి 60 నుండి 125 కాంతి సంవత్సరాల దూరాన ఉన్నాయి. ఇవి ఏర్పడి 450 - 500 కోట్ల సంవత్సరాలయ్యాయి.

మన గెలాక్సీ "పాలపుంత"కి సమీపములో నున్న గెలాక్సీ "ఆంద్రొమిడా". వీటి మధ్య నున్న దూరము 25 లక్షల కాంతి సంవత్సరములు. "ఆంద్రొమిడా" ఏర్పడి 900 కోట్ల సంవత్సరములయ్యింది. ఇందులో లక్ష కోట్ల నక్షత్రాలున్నాయి.

సూర్య నక్షత్రము ఏర్పడి 460 కోట్ల సంవత్సరములు. ఈ నక్షత్ర మండలములో 8 పెద్ద గ్రహాలు, 5 చిన్న గ్రహాలున్నాయి. వీటితో పాటు తోక చుక్కలు, ఉల్కలు, ధూళి ఉన్నాయి. సూర్యమండలములో మన "భూమి" ఒక గ్రహము. భూమి ఏర్పడి 456 కోట్ల సంవత్సరములు. భూమికి ఉపగ్రహము "చంద్రుడు". చంద్రుడు ఏర్పడి 453 కోట్ల సంవత్సరములు.

# అధ్యాయము - 2

## సూర్యుడు, భూమి, చంద్రుడు

సౌరవ్యవస్థ (సోలార్ సిస్టమ్)లో 8 పెద్ద గ్రహములు, 5 చిన్న గ్రహములున్నాయని ఖగోళశాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ఇంకా మరి కొన్ని గ్రహములుండవచ్చునని ఊహిస్తున్నారు.

సూర్యున్నుండి వరుసగానున్న పెద్ద గ్రహములు మెర్క్యురీ (బుధుడు), వీనస్ (శుక్రుడు), ఎర్త్ (భూమి), మార్స్ (అంగారకుడు). ఈ నాలుగు అంతర్ (ఇన్నర్) గ్రహములు. వీటి తర్వాత ఆస్టరాయిడ్ బెల్ట్ (ఉల్కల వడ్డాణము) సూర్యుని చుట్టూ వున్నది. ఈ వడ్డాణము తర్వాత జుపిటర్ (బృహస్పతి లేక గురువు), శాటర్న్ (శని), యురానస్, నెప్ట్యూన్ ఉన్నాయి. ఇవి బహిర్ (అవుటర్) గ్రహాలు. ఈ ఎనిమిది పెద్ద గ్రహాలలో అతి పెద్దది జూపిటర్. వీటి తర్వాత 5 చిన్న గ్రహాలు - సెరస్, ప్లూటో, హౌమి, మేక్‌మేక్, ఎరిస్ ఉన్నాయి. ఈ గ్రహాలలో కొన్నిటికి ఒకటి లేక ఒకటి కన్నా ఎక్కువ ఉపగ్రహాలున్నాయి. వీటితో పాటు 3336 తోకచుక్కలు (కామెట్స్), ఉల్కలు (మెటియోర్స్, ఆస్టరాయిడ్స్), ధూళి (కాస్మిక్‌డస్ట్) ఉన్నాయి.

సూర్యుడు ఒక నక్షత్రము. ఇది ఒక మండే గోళము. ఇందులో హైడ్రోజన్ (ఉదజని) వాయువు హీలియమ్ వాయువుగా మారుతుంది. రెండు వుదజని అణువులు సంయోగము చెందగా ఒక హీలియమ్ అణువుగా మారుతుంది. ఇటువంటి అణు సంయోగము ద్వారా మహాశక్తి వెలువడుతుంది. ఈ శక్తే కాంతిగా, వేడిగా, రేడియేషన్‌గా మారి సౌర వ్యవస్థను ప్రభావితము చేస్తుంది. సూర్యగోళపు వ్యాసార్థము 7 లక్షల కి.మీ. లు.

**భూమి :-**

సూర్యున్నుండి భూమి మూడవ గ్రహము. సూర్యునికి 15 కోట్ల కి.మీ.ల దూరములో వుంది. దీని వ్యాసార్థము 6371 కి.మీ.లు. చుట్టుకొలత 40075 కి.మీ.

సూర్యున్ని 13 లక్షల ముక్కలుగా చేస్తే ఒక ముక్కంత పరిమాణములో భూమి ఉంటుంది. సూర్యుని చుట్టూ భూమి తన కక్ష్యలో గంటకు 66,600 కి.మీ.ల వేగముతో తిరుగుతుంది. ఒకసారి ఈ కక్ష చుట్టుటకు 365 రోజులు పడ్తుంది. భూమి తనలో తాను ఒకసారి తిరుగుటకు 24 గంటలు పడ్తుంది. ఈలాగున భూమి తనలో తాను తిరుగుట వలన భూమిలో ప్రతి భాగములో సరాసరి 12 గంటలు పగలుగాను 12 గంటలు రాత్రిగాను ఉంటుంది. అయితే ధృవప్రాంతములలో పగలు, రాత్రి సమయములు మారుతూవుంటాయి. ఈ భ్రమణముల వలన కాలములు, ఋతువులు సంభవిస్తాయి. భూ ఉపరితలము 70% నీటితోను 30% నేలతోను (6 ఖండములు) వున్నది. గ్రహాలన్నిటిలోను భూమి ప్రత్యేకమైనది. భూమిపైనే జీవమున్నది.

**చంద్రుడు :-**

చంద్రుడు భూమికి ఉపగ్రహము. భూమి ఏర్పడిన 3 కోట్ల సం॥లకు అంగారకుని పరిమాణములోనున్న ఒక వస్తువు భూమిని ఢీ కొనగా భూమి నుండి ఒక ముక్క తుళ్లి, భూమిచుట్టూ ఒక కక్ష్యలో తిరుగసాగింది. అదే చంద్రుడు. ఈ కక్ష్య భూమినుండి 3 లక్షల 56 వేల కి.మీ. నుండి 4 లక్షల 6 వేల కి.మీ. దూరములో మారుతూ ఉంటుంది. భూమి చుట్టూ చంద్రుడు ఒకసారి తిరుగుటకు 27 రోజుల 8 గంటలు సమయము పడ్తుంది. ఆలాగునే చంద్రుడు తనలో తాను

తిరుగుటకు అంతే సమయము పడ్తుంది. కావున చంద్రుడు ఒకే దిశలో కనపడ్తాడు. చంద్రుడు వెనుక భాగము మనకు కనబడదు.

చంద్రుని చుట్టుకొలత 10,917 కి.మి. వ్యాసము 3474 కి.మి. భూమిని 81 ముక్కలుగా చేస్తే ఒక ఒక ముక్కంత పరిమాణములో చంద్రుడు ఉంటాడు. సూర్యకాంతి చంద్రుని పైబడి పరావర్తనము చెంది భూమిపై "వెన్నెల"గా ప్రసరిస్తుంది.

సూర్యుడు, చంద్రుడు, భూమి ఒకే వరుసలోకి వచ్చినప్పుడు సూర్యగ్రహణము (అమావాస్యనాడు) ఏర్పడుతుంది. సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే వరుసలోకి వచ్చినప్పుడు చంద్రగహణము (పున్నమినాడు) ఏర్పడుతుంది. చంద్రునిపై మానవుడు రెండుసార్లు (1969, 1972 లో) కాలుమోపాడు.

భూమిపై సూర్యుని, చంద్రుని ఆకర్షణ ప్రభావముంది. ఈ ప్రభావము సముద్రపు నీటిపై ఆటు-పోటులను కలుగజేస్తుంది. ఇది నిరంతర ప్రక్రియ. ఆలాగునే సూర్యుని వేడి, చంద్రుని చల్లదనము వలన భూమిపై నున్న వాతావరణము ప్రభావితమై మేఘాలు, వర్షములు, మెరుపులు కలుగుతాయి. ఒక సంవత్సరకాలములో 140 కోట్ల మెరుపులు భూవాతావరణములో మెరుస్తాయి. ఈ మెరుపులు - వేడిగాలి, చల్లనిగాలి ఒక దాన్నొకటి స్పృశించగా ఏర్పడుతాయి.

భూమి ఆకర్షణ శక్తిలో చంద్రుని ఆకర్షణ శక్తి 17% మాత్రమే. భూమిపై 100 కిలోల బరువు చంద్రునిపై 17 కిలోలుగా తూగుతుంది.

# అధ్యాయము - 3

## <u>భూమి</u>

**శాస్త్రజ్ఞుల విశ్లేషణ ప్రకారము**

**భూమి ప్రత్యేకత :-** భూమిపై వాతావరణముంది. భూఉపరితలము 70% నీరు, 30% నేల ఉన్నాయి. భూమి మధ్యలో మాగ్మా / లావా ఉంది.

భూమిని అడ్డంగా కోసి చూస్తే మూడు పొరలు కనిపిస్తాయి.

**1. పై పొర** : **"క్రస్ట్"** సరాసరిగా 40 కి.మీ. మందము ఉంటుంది. ఇది ఘనపదార్థము.

**2. రెండవ పొర** : **'మేంటల్"** 40 కి.మీ.ల నుండి 2700 కి.మి.మధ్యన ఉన్న పొర. దీన్ని 3 పొరలుగా విభజించారు.

1. అప్పర్ మేంటల్ 2. ట్రాన్సిషన్ రీజియన్ 3. లోయర్ మేంటల్

**3. మూడవ పొర** : **"కోర్"**2700 కి.మి. నుండి 6371 కి.మి. (కేంద్ర బిందువు) మధ్యన ఉంటుంది. మొత్తము మీద ఈ కోర్ వ్యాసము 7342 కి.మి. ఇది ద్రవ పదార్థము. ఇదే మాగ్మా లేక లావా. క్రస్ట్ ఉపరితలమే. భూ ఉపరితలము. 70% నీటిలో మూడు మహాసముద్రాలు పసిఫిక్, అట్లాంటిక్, ఇండియన్ (హిందూ) ఉన్నాయి. 30% నేలలో 6 ఖండాలు. అవి ఆసియా, ఆఫ్రికా, ఉత్తర, దక్షిణ అమెరికాలు, ఆస్ట్రేలియా, అంటార్కిటికా వున్నాయి మరియు అనేక ద్వీపాలున్నాయి.

అప్పర్ మేంటల్ పై టెక్టానిక్ పలకలున్నాయి. ఈ పలకలు చాలా నెమ్మదిగా వంద సంవత్సరాలలో 1 లేక 2 సెంటిమీటర్లు కదులుతాయి. ఇలా కదిలి ఒకదానితో ఇంకొకటి ఢీ కొని భూకంపాలు కలిగిస్తాయి.

ఈ భూకంప ప్రభావము వలన క్రస్ట్ ఉపరితలము పై ఎత్తు పల్లాలు కలిగి పర్వతాలు / కొండలు, లోయలు, ఏర్పడుతాయి. లోయలలో నీరు చేరి సరస్సులు ఏర్పడ్డాయి : కొన్ని చోట్ల అగ్ని పర్వతాలు పుట్టి లావా ఎగజిమ్ముతుంది.

**వాతావరణము :-** భూమిపై 6200 మైళ్ళు ఎత్తు వరకు వాతావరణము (అట్మాస్ఫియర్) ఉంది. ఆ పై అంతరిక్షము (స్పేస్, శూన్యము) ఉంది. అట్మాస్ఫియర్‌ని 5 పొరలుగా విభజించారు.

**1. ట్రోపోస్ఫియర్ :-** భూమిపై 11 మైళ్ళు ఎత్తు వరకు ఉంది. ఇందులో ఎక్కువగా నత్రజని (79%) ఆమ్లజని (ఆక్సిజన్), 21% కంటే కొంచము తక్కువగా వుంది. ఆ తక్కువలో బొగ్గుపులుసు (కార్బన్ డై ఆక్సైడ్) వాయువు, ఇతర వాయువులున్నాయి. ఈ రెండు ప్రధాన వాయువులే జీవాధారము మేఘాలు ఈ పొరలోనే ఉంటాయి. వర్షాలు, మెరుపులు, ఉరుములు ఇందులోనే సంభవిస్తాయి.

**2. స్ట్రాటోస్ఫియర్ :-** 11 నుండి 30 మైళ్ళు ఎత్తు వరకు ఈ పొర ఉంది. ఇందులో "ఓజోన్" వాయువు వుంది. ఇది సూర్యున్నుండి వెలువడే "అతి నీల లోహిత" (అల్ట్రావయోలెట్) కిరణాలను అడ్డుకొని ప్రాణికోటిని కాపాడుతుంది.

**3. మిసోస్ఫియర్ :-** 30 నుండి 55 మైళ్ళు ఎత్తు వరకు ఈ పొర ఉంది. ఇది అతి శీతలముగా ఉంటుంది.

**4. థెర్మోస్ఫియర్ :-** 55 నుండి 400 మైళ్ళు ఎత్తు వరకు ఈ పొర ఉంది. దీనిలో ఉష్ణోగ్రత 2000 డిగ్రీల వరకు ఉంటుంది. దారి తప్పిన ఉల్కలు భూమిపైకి దూసుకు వస్తూ ఈ పొరలో ప్రవేశించగానే మండిపోతాయి. పెద్ద ఉల్కలైతే కొంత వరకు మండి, భూమిని ఢీ కొనగా భూమిపై పెద్ద గోతులు ఏర్పడతాయి.

**5. ఎక్సోస్ఫియర్ :-** 400 నుండి 6200 మైళ్ళు వరకు ఈ పొర ఉంది. మనము పంపే ఉపగ్రహాలు ఇందులోనే పరిభ్రమిస్తాయి.

భూమికి ఉన్న ఆకర్షణ శక్తి (గ్రేవిటేషనల్ ఫోర్స్) వలన నీరు, వాతావరణము

భూ పరిధిలో ఉన్నాయి. ఈ శక్తి లేకపోతే ఇవి అంతరిక్షములో కలిసిపోతాయి.

భూమిపై సూర్యచంద్రుల ఆకర్షణ ప్రభావముంది. ఈ ప్రభావమే సముద్రపు అలలను ఆటు – పోటులను కలుగజేస్తుంది.

సూర్యుని వేడి, నీటిని ఆవిరిగా మార్చుతుంది. ఈ నీటి ఆవిరి మేఘాలుగా ఏర్పడి వర్షము కురుస్తుంది. ఈ ఆవిరి కొన్నిసార్లు అతిగా చల్లబడి ఘనీభవించి వడగళ్ళ వానగా కురుస్తుంది. ట్రోపోస్ఫియర్‌లో వేడిగాలులు, చల్లనిగాలులు విద్యుత్ ఆవేశము కలిగి ఉంటాయి. ఇవి ఒకదానికొకటి స్పృశించినప్పుడు మెరుపులు పుడ్తాయి. ఒక సంవత్సరకాలములో 140 కోట్ల మెరుపులు మెరుస్తాయి. మెరుపుల వేడికి గాలి వ్యాకోచించి ఉరుములు ఉరుముతాయి. మెరుపులు భూమిని తాకితే "పిడుగులు" అవుతాయి.

సూర్యుని వేడి "ట్రోపోస్ఫియర్" పొరలోని వాయువులపై ప్రభావము చూపి, హెచ్చు తగ్గుల వత్తిడి (ప్రెషర్) కలుగజేస్తుంది. ఎక్కువ వత్తిడి గల ప్రాంతమునుండి తక్కువ వత్తిడి గల ప్రాంతానికి ఈ వాయువులు ప్రసరిస్తాయి. ఈ ప్రసరణే "గాలి". ఈ ప్రసరణ తీవ్రతను బట్టి గాలివేగము మారుతుంది. గాలి, వర్షము ఒకేసారి సంభవించినప్పుడు గాలివానలు తుఫానులు కలుగుతాయి. భూమిపై నున్న ఈలాంటి వాతావరణమే భూమిపై జీవోద్భవానికి కారణము.

శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారము భూమి ఏర్పడిన 100 కోట్ల సంవత్సరాలకు భూమిపై జీవము ఉద్భవించింది. రకరకాల జీవుల పుట్టుక క్రమమును శిలాజములు (ఫోసిల్స్) కార్బన్ డేటింగ్, డి.ఎన్.ఏ పరీక్షల పద్ధతుల ద్వారా శాస్త్రజ్ఞులు నిర్ణయించారు.

| జీవకోటి రకము | ఎన్నాళ్ళ క్రితము |
|---|---|
| న్యూక్లియస్‌తో కూడిన కణములు | 210 కోట్ల సంవత్సరములు |
| లైంగిక క్రియా సూక్ష్మ జీవులు | 120 కోట్ల సంవత్సరములు |
| ప్రాథమిక జంతుజాలము | 50 కోట్ల సంవత్సరములు |
| వెన్నెముక లేని జీవులు | 53 కోట్ల సంవత్సరములు |
| వెన్నెముక జీవులు / చేపలు | 50 కోట్ల సంవత్సరములు |
| నేలపై చెట్లు | 47 కోట్ల సంవత్సరములు |
| కీటకములు | 40 కోట్ల సంవత్సరములు |
| ఉభయచర జీవులు | 36 కోట్ల సంవత్సరములు |
| పాము, బల్లి జాతి | 30 కోట్ల సంవత్సరములు |
| డైనోసార్స్ (రాక్షస బల్లులు) | 23 కోట్ల సంవత్సరములు |
| క్షీరదములు | 22 కోట్ల సంవత్సరములు |
| పక్షులు | 15 కోట్ల సంవత్సరములు |
| పూలు పూసే చెట్లు | 13 కోట్ల సంవత్సరములు |
| ప్రాథమిక కోతి జాతి | 8 కోట్ల సంవత్సరములు |
| కోతి జాతి | 3 కోట్ల సంవత్సరములు |
| అతిప్రాథమిక మానవ జాతి | 60 లక్షల సంవత్సరములు |
| పరిణతి చెందని మానవజాతి | 25 లక్షల సంవత్సరములు |
| పూర్తిగా పరిణతి చెందిన నేటి మానవులు | 10 వేలు సంవత్సరములు |

# అధ్యాయము - 4

## భూమిపై మానవ సంచారము, నాగరితలు

శాస్త్రజ్ఞులు తమకు దొరికిన ఆధారాలు, ఫోసిల్స్‌ని, డి.ఎన్.ఏ. పరీక్షలు ద్వారా, కార్బన్ డేటింగ్ ద్వారా విశ్లేషించి కొన్ని విషయములు సరిగ్గా అంచనా వేసి మనకు తెలియజేస్తున్నారు.

సుమారు 2 లక్షల సంవత్సరముల క్రితం మానవుల పూర్వీకులు ఆఫ్రికా ఖండములో ఉద్భవించారు. నేటి మానవ స్త్రీ యొక్క పూర్వీకురాలు ఒక లక్ష సంవత్సరముల క్రితం పరిపూర్ణ స్త్రీగా ఉద్భవించింది. వీరి సంతతి సుమారుగా 60 - 50 వేల సంవత్సరముల క్రితము తూర్పు ఆఫ్రికా గుండా (ప్రస్తుతమున్న సూయజ్ కెనాల్ ప్రదేశము) ఆసియా / ఐరోపా ఖండములకు వలస వచ్చారు. వీరిని ఆస్ట్రలాయిడ్స్ అన్నారు. వీరు గుంపులుగా జీవిస్తూ, గుహలలో నివశిస్తూ అడవి జంతువులను యెముకలతోను / రాతి పనిముట్లుతోను వేటాడి పచ్చి మాంసము తినేవారు. చెట్లుపై నుండే కాయలను పండ్లను తినేవారు. జంతుచర్మములను వస్త్రములుగా ధరించేవారు. రానురాను వీరికి అగ్ని గురించి తెలిసింది. జంతువులను మచ్చిక చేసుకొనుట తెలిసింది. వీరికి చెట్లను, మొక్కలను పెంచడము తెలిసింది. వీరు పాతరాతియుగము, క్రొత్తరాతియుగముల వరకు అభివృద్ధి చెందుతూ వచ్చారు. వీరి వెంటే "నీగ్రోలు" భూమిపై విస్తరింపసాగారు. ఆస్ట్రలాయిడ్స్‌కి, నీగ్రోలకు ఘర్షణలు జరుగుతుండేవి.

క్రొత్తరాతియుగము ముగింపు నాటికి చాలా మార్పులు జరిగాయి. ప్రపంచములో విస్తరించిన మానవులలో / వారి శరీరములో జరిగిన మార్పులు - శరీరరంగు, జుత్తు, ముఖ కవలికలు, కళ్ళు. వారి ఆహారపు అలవాట్లను బట్టి వాతావరణ పరిస్థితులను బట్టి, జీన్‌మ్యూటేషన్స్ బట్టి ఈ మార్పులు జరిగాయి. ఈ మార్పులను శాస్త్రజ్ఞులు విశ్లేషించి మానవులను మూడు ప్రాథమిక వర్గాలుగా విభజించారు. నల్లగా వున్నవారు ఆఫ్రికా ఖండములో జీవించారు. వీరిని "నీగ్రోయిడ్స్" అన్నారు. తూర్పు ఆసియా ప్రదేశములో పసుపురంగు వున్నవారిని

"మంగోలాయిడ్స్" అన్నారు. మిగతావారిని "కకేషియన్స్" అన్నారు.

ఈ మార్పులు జరుగుతుండగానే, మానవులు అగ్ని యొక్క, నీటి యొక్క ప్రాముఖ్యతను గుర్తించారు. జంతు అభివృద్ధికి, పోషణకు, వ్యవసాయానికి భూమిపై నున్న వనరులను గుర్తించారు. ముఖ్యముగా గడ్డి భూములను, పచ్చిక బయళ్ళను వాటి ప్రాముఖ్యతను గుర్తించారు. నదీ తీరాలను, సరస్సు తీరాలను, వాటి ప్రాముఖ్యతను గుర్తించారు. ఆఫ్రికా ఖండములోని "సవన్నా" గడ్డి భూములను ఆసియాలోని "స్టెప్పీసు" గడ్డిభూములను వారి స్థిరనివాసానికి అనుగుణమని తెలుసుకున్నారు. తర్వాత తర్వాత ఉత్తర అమెరికాలోని "ప్రైరీసు" దక్షిణ అమెరికాలోని "పాంపాస్" అస్ట్రేలియాలోని "డౌన్స్" గడ్డి భూములే ఆయా చోట్ల మానవ స్థిరనివాసానికి ఆలవాలమయ్యాయి.

క్రీస్తు పూర్వము 10 - 8 వేల సంవ్సరముల నాటికి క్రొత్తరాతియుగము ప్రారంభమై మానవులు గుంపులుగాను, తెగలుగాను విడిపోయి, ఆయా ప్రదేశములలో స్థిరనివాసము ఏర్పర్చుకున్నారు. గుంపులు మధ్య తెగల మధ్య పోరాటాలు జరిగేవి. బలవంతులు, బలహీనులను లొంగదీసుకొని వారిని బానిసలుగా చేసుకొనడము ఆరంభించారు. బలహీన తెగల పురుషులను చంపివేసి, వారి స్త్రీలను స్వంతము చేసుకొనేవారు.

క్రీస్తు పూర్వము 6 వేల సం॥ముల నాటికి మొదటిగా మానవుడు క్రొత్త జీవన విధానానికి అలవాటుపడి, నేటి ఇరాక్‌లోని "మెసపొటేమియా" ప్రాంతములో స్థిరనివాసము ఏర్పర్చుకొని "మానవ నాగరికతకు" ఆధ్యుడయ్యాడు. "టైగ్రిస్" "యూఫ్రటీసు" నదీ తీరాలలో జీవనము సాగించాడు. పశుపోషణ అభివృద్ధి చేశాడు. వ్యవసాయము మొదలుపెట్టాడు. ఈలాగు అభివృద్ధి చెందుతూ "బ్రాంజ్" (కంచు) యుగములోనికి అడుగుపెట్టాడు. రాగి లోహము కనిపెట్టి కంచు పనిముట్లు తయారు చేసి ఉపయోగించడము ఆరంభించాడు.

క్రీస్తు పూర్వము 4000 - 3500 సం॥ములలో టైగ్రీస్ యూఫ్రటీస్ నదీ తీరాన "మెసపొటేమియా" నాగరికత ప్రారంభమైనది. మెసపొటేమియా దక్షిణ

దిక్కున "సుమేరియా" నాగరికత బాగా అభివృద్ధి చెందింది.

క్రీస్తు పూర్వము 3500 - 3000 సం॥లో తూర్పు ఆఫ్రికాలో నైలునదీ తీరాన "ఈజిప్టు" నాగరికత ప్రారంభమైనది.

ఈ నాగరికత అభివృద్ధి చెందుచుండగా మానవులలో దేవుని గురించి / దేవతల గురించి ఆలోచనలు ఆరంభమైనాయి. సూర్యున్ని, ప్రకృతి శక్తులను ఆరాధించడము మొదలైంది. రాజులను దేవుళ్ళుగా కొలిచేవారు.

సుమేరియ ప్రాంతమునుండి "ద్రావిడులు" "భరతఖండము" వాయువ్య దిశలో ప్రవేశించి సింధూనదీ తీరాన స్థిరపడి "సింధూనాగరికత" స్థాపించారు. క్రీస్తు పూర్వము 3000 - 2500 సం॥లలో ఈ నాగరికత అభివృద్ధి చెందింది.

క్రీస్తు పూర్వము 1000 సం॥లకు మానవుడు "ఇనుప" (ఐరన్) యుగములో ప్రవేశించాడు.

ఈ నాగరికతలతో పాటు పశుపోషణ, వ్యవసాయము, పట్టణనివాసములు అభివృద్ధి చెందాయి. తమ ప్రాంతాలను, ప్రదేశములను కాపాడుకొనుటకు ప్రజలు యుద్ధవిద్యను అభివృద్ధి చేశారు. పశువుల కొరకు, వ్యవసాయ భూముల కొరకు యుద్ధములు చేశారు. బలవంతులు బలహీనులను జయించి వారి నివాసములను ధ్వంసము చేశారు. బలహీనుల పురుషులను చంపివేసి వారి స్త్రీలను, పిల్లలను బానిసలుగా తీసుకొనిపోయేవారు. బలవంతులు తమ ప్రాంతాలను అభివృద్ధిపరచి, వాటి కాపలాను పటిష్టపరచి, పాలనావ్యవస్థను ఏర్పర్చుకొని, వారి జీవన విధానము సామాజికంగా తీర్చుదిద్దుకొని చిన్న చిన్న రాజ్యాలుగా ఏర్పడ్డారు. ఇలా రాజ్యాలు ఏర్పడినాక, బలవంతులైన రాజులు వేరే రాజ్యాలను జయించి తమ పాలన క్రిందకు తెచ్చుకొని సామ్రాజ్యాలు స్థాపించారు. ఈ సామ్రాజ్యాలు కూడా బలవంతులైన వారి చేతులలో మారుతూ వచ్చాయి. మొదట బాబిలోనియా, తర్వాత మాదీయులు, పారసీకులు, గ్రీకులు, రోమనులు చేతులలోకి సామ్రాజ్యాలు మారుతూ వచ్చాయి. క్రీస్తు శకారంభము తర్వాత కూడా ఇదే పరంపర కొనసాగింది.

# అధ్యాయము - 5

## భారత ఉపఖండములో మానవ సంచారము - నాగరికత

క్రీస్తు పూర్వము సుమారు 50 వేల సం॥రాల క్రితమే ఆస్ట్రలాయిడ్స్ భరత ఉపఖండములో ప్రవేశించారు. వారి సంతతి నేటికీ అండమాను దీవులలో, దక్షిణ భారత కొండ ప్రాంతములలో వున్నారు. వీరి తర్వాత నీగ్రోలు వచ్చారు. వీరి సంతతి కూడా దక్షిణ భారత దేశములోను, శ్రీలంకలోను వున్నారు.

వీరి తర్వాత ద్రావిడులు (నల్లనివారు) సుమేరియా ప్రాంతము నుండి వచ్చి భారత దేశపు వాయువ్య దిశలో సింధూనదీ తీరాన స్థిరపడ్డారు. వీరి ఉనికి "హరప్ప" "మొహంజదారో" త్రవ్వకాలలో బయటపడింది. సుమారు క్రీస్తు పూర్వము 3000 - 2500 సం॥రాలలో ఉత్తర భారతదేశములో స్థిరపడి, పట్టణాలు నిర్మించి మంచి సామాజిక జీవనము గడిపారు. వీరు లింగపూజ చేసేవారు. నరబలులు, జంతుబలులు ఇచ్చేవారు. ఎద్దు వాహనము గల "నన్నా" అనే దేవుడు. "యిస్తారో" అనే దేవత అనేక చేతులు కలది. వీరిని ద్రావిడులు పూజించేవారు.

**ఆర్యులు :** క్రీస్తు పూర్వము 2000 - 1500 సం॥రాలలో మధ్య ఆసియా (స్టెప్పీసు గడ్డిభూముల ప్రాంతము) నుండి పర్షియా, ఆఫ్ఘనిస్థానుల మీదుగా భరత ఉపఖండములో వాయువ్య దిశనుండి ప్రవేశించారు. వీరు యుద్ధప్రియులు. ఉత్తరభారతదేశములో నున్న "ద్రావిడులను" ఓడించి వారి పట్టణాలను కాల్చివేసి, మగవారిని చంపివేసి, ఆడవారిని, పిల్లలను బానిసలుగా చేసుకున్నారు. కొందరు ద్రావిడులు వింధ్యపర్వతాలు దాటి దక్షిణ భారతదేశములో ప్రవేశించారు.

ఆర్యులు వారితోపాటు సంస్కృత భాషను, ఋగ్వేదమును, వర్ణవ్యవస్థను, జానపదగాథలను, గుర్రాలను, ఆయుధాలను, రథాలను తీసుకొని వచ్చారు. క్రీస్తు పూర్వము 1500 - 500 సం॥రాల వరకు ఆర్యులు ఋగ్వేదాన్ని అభివృద్ధి పరచి వైదిక జీవనము సాగించారు. ఆకాశాన్ని, సూర్యున్ని, వర్షాన్ని ఆరాధించేవారు. వాయువ్య దిశనుండి తూర్పున ఉన్న సుందర్‌బన్స్ వరకు విస్తరించారు. వింధ్య పర్వతాలు దాటలేదు.

ఈశాన్య దిశనుండి భారతదేశములో ప్రవేశించిన కొలారియన్లు (మంగోలాయిడ్స్) తో ఆర్యులు స్నేహముగా ఉండి వారితో సంపర్కము చేశారు. ఆర్యులు భారతదేశము రాకముందు వారికి "సింహము" గురించి తెలుసు. వారు సుందర్‌బన్స్‌కు వచ్చేసరికి "పులిని" గురించి తెలుసుకున్నారు.

ద్రావిడులను జయించేటప్పుడు వారి లింగపూజను, నరబలులను, జంతుబలులను ఆర్యులు అసహ్యించుకున్నారు. క్రీస్తు పూర్వము 607 సం॥ములో బాబిలోనియా రాజు డేరియస్ తన సామ్రాజ్యాన్ని సింధూప్రాంతము వరకూ విస్తరించాడు. క్రీస్తు పూర్వము 330 సం॥లో గ్రీకురాజు అలెగ్జాండర్ బాబిలోనియాను వశపరచుకొని తన సామ్రాజ్యాన్ని సింధూ ప్రాంతము వరకు విస్తరించాడు. గ్రీకులనుండి ఆర్యులు జ్యోతిషశాస్త్రము నేర్చుకున్నారు.

క్రీస్తుపూర్వము 500 సం॥ వరకు వైదిక యుగము కొనసాగింది. ఆపై 500 సం॥లు బ్రాహ్మణ యుగము సాగింది. ఈ 500 సం॥లలో కొన్ని సామాజిక మార్పులు జరిగాయి. జనపదాలు, మహాజనపదాలు (రాజ్యాలు) ఏర్పడ్డాయి. బుద్ధుడు ప్రజలను ప్రభావితము చేసి, ఆర్యులు ప్రవేశపెట్టిన వర్ణవ్యవస్థను ఛిద్రము చేశాడు. ప్రజలు, రాజులు, బౌద్ధమతము అవలంభించారు. నందవంశము, మౌర్య వంశము, గుప్తవంశస్తులు ఉత్తరభారతదేశాన్ని పరిపాలించారు. క్రీస్తు శకము 700 సం॥ల నుండి మహమ్మదీయులు దండయాత్రలు చేసి సుమారుగా 1000 సం॥లు దేశాన్ని పాలించారు. తర్వాత బ్రిటిష్‌వారు సుమారుగా 200 సం॥లు పాలించారు.

క్రీస్తుకు పూర్వము ఆ తర్వాత భారతీయులు పశ్చిమ దేశాలతోను, తూర్పుదేశాలతోను, వ్యాపార సంబంధాలు నెరపారు. ఈ వ్యాపార సంబంధాలే తర్వాత భారతదేశముపై దండయాత్రలకు, ఆక్రమణలకు పురికొల్పాయి.

# అధ్యాయము - 6

# హిందూ దేశము

## ద్రావిడ, ఆర్య సంస్కృతులు - వర్ణ వ్యవస్థ.

**ద్రావిడులు** :- క్రీ॥పూ॥ సుమారు 3000 సంవత్సరములలో "మెసపొటేమియ" (ఇరాక్) నుండి నల్లనివారు భారతదేశములోని వాయువ్య ప్రాంతానికి వచ్చారు. వీరు "సింధూ నాగరికత" కర్తలు. "హరప్పా" "మొహంజాదారో" త్రవ్వకాలలో వీరి నాగరికత బయటపడింది. వీరే ద్రావిడులు. పట్టణ జీవితానికి అలవాటు పడినవారు. వ్యవసాయము, పశు పాలన కూడా చేసేవారు. పట్టణాలను పరిశుభ్రముగా వుంచేవారు. మంచి "డ్రైనేజీ" పద్ధతి వుండేది. పబ్లిక్ బాత్‌రూములు ఉండేవి. శవాలను సమాధి చేసేవారు. వీరు మాంసాహారులు, మధ్యపానాసక్తులు, వంటపాత్రలుపయోగించేవారు. యుద్ధాసక్తి లేనివారు. శాంత జీవనము సాగించేవారు.

వీరికి ముఖ్యమైన దేవత "పురుషాంగము" ఎందుకంటే మానవుల విస్తరణకు ఇదే ముఖ్యము అని వారి భావన. అందుకే "లింగపూజ" జరిపేవారు. లింగానికి బలులు ఇచ్చేవారు. ఎద్దు వాహనముగల "నన్నా" వీరి దేవుడు. అనేక చేతులు కల "యిస్తారో" వీరి దేవత.

ద్రావిడులు ఉత్తరభారత దేశములో హిమాలయ, వింధ్య పర్వతాల మధ్య విస్తరించి అనేక పట్టణాలు కట్టుకొని నివసించేవారు. వీరు సుమారుగా 1500 సంవత్సరాలు ఈ విధముగా జీవనము సాగించారు.

క్రీ॥పూ॥ 1500 సం॥లకు ఆర్యులు భారతదేశానికి వచ్చి, ద్రావిడులపై దండెత్తారు. వారి పట్టణాలను తగులబెట్టారు. పురుషులను చంపి స్త్రీలను బానిసలుగా వాడుకున్నారు. కొంతమంది ద్రావిడులు, యుద్ధ విద్యయందు ఆరితేరిన ఆర్యులను ప్రతిఘటించలేక వింధ్య పర్వతములను దాటి దక్షిణభారతదేశము పోయి అక్కడ

స్థిరపడి అభివృద్ధి చెందసాగారు. కాలక్రమేనా ద్రావిడులు వృద్ధి చెంది చిన్న చిన్న రాజ్యములు ఏర్పర్చుకొని "లింగ" పూజకు ప్రాధాన్యతనిస్తూ జీవింపసాగారు.

"భారతదేశము"లో క్రీస్తు పూర్వము 563 సం॥లో బుద్ధుడు జన్మించాడు. అతని పేరున "బౌద్ధ" మతము వ్యాప్తి చెందసాగింది. ఉత్తరభారతదేశాన బౌద్ధమతము బ్రాహ్మణుల మనుగడకు ముప్పుగా పరిణమించింది. వర్ణబేధములు (వ్యవస్థ) శూద్రులను "బౌద్ధమతము" అవలంభించజేసింది. బ్రాహ్మణుల పెత్తనాన్నికి శూద్రులు ప్రతిఘటించసాగారు. బౌద్ధ బిక్షుకులు దక్షిణ, భారత దేశమునకు పోయి బౌద్ధమతాన్ని విస్తరింపచేయసాగారు. క్రీ॥పూ॥ 300సం॥లలో బౌద్ధమతం దేశమంతటా విస్తరించింది.

ఈ కాలములోనే బ్రాహ్మణులు బౌద్ధమతమునకు విరుగుడుగా అనేక "హిందూ" మతగ్రంథాలు వ్రాశారు. ఇతిహాసాలు, పురాణాలు, భాగవతము మున్నగు గ్రంథాలు వ్రాసి వ్యాప్తి చేయసాగారు. బౌద్ధమతాన్ని దేశములో నిర్మూలించుటకు అన్ని ప్రయత్నాలు చేయసాగారు. అందులో భాగముగానే, ఆర్యులు - ద్రావిడులపై యుద్ధానికి సిద్ధపడక, బ్రాహ్మణులను దక్షిణబారత దేశానికి "మిషనరీ"లుగా పంపారు. వీరు దక్షిణ భారతదేశాన వున్న ద్రావిడుల రాజ్యాలలో ప్రవేశించి, రాజాదరణ సంపాదించి, హిందూ మతము వ్యాప్తి చేయసాగారు. బౌద్ధమతాన్ని, లింగపూజార్లను రాజులకు దూరము చేయసాగారు. రాజుల అనుగ్రహమును సంపాదించుటకు ద్రావిడులు "లింగ"మును, వేదములోనున్న "రుద్రున్ని" కలిపి ఒక కొత్త దేవున్ని నెలకొల్పారు. అతడే "శివుడు". శివుణ్ణి ద్రావిడుల ఆచారానికి తగినట్లుగా రూపొందించారు. దాని ద్వారా బ్రాహ్మణులు హిందూమతాన్ని దక్షిణభారతదేశములో వ్యాప్తి చెందించసాగారు. భౌద్ధారామాలను కూల్చివేసి వాటిపై శివ మందిరాలు నిర్మింపచేశారు.

శివుని భార్య అయిన పార్వతిని అనేక రూపాలుగా రూపొందించి ప్రజలను ఆకట్టుకున్నారు. ప్రతి గ్రామానికి ఒక "అమ్మ"ను రూపొందించి ఆ "అమ్మ"ను పార్వతి అంశగా ప్రాచుర్యము చేయసాగారు.

అందుకే దక్షిణ భారతదేశములో అనేక "అమ్మ"లు కనపడ్తారు. మశూచి, విషూచి, కలరా, ప్లేగు లాంటి అంటువ్యాధులకు ఒక్కో అమ్మను కల్పించి ఆ "అమ్మ"ను పూజించేటట్లు చేశారు. అందుకే దక్షిణ భారతదేశములో "అమ్మోరు" "ప్లేగమ్మ" "పోలేరమ్మ" "తలుపులమ్మ" "మైసమ్మ" "సంతోషిమాత" మొదలగు పేర్లతో దేవతలు వెలిశాయి. వీరందరిదీ పార్వతి అంశగావున్న - పార్వతికి "అమ్మలను గన్న అమ్మ" అని పేరు వచ్చింది. అనేక చేతులు కల "యిస్తారో", దేవత "కాళిక" దేవి అయింది.

ఆలాగునే దక్షిణ భారతాన చనిపోయిన కొంతమంది స్త్రీ, పురుషులను కూడా దేవతలు గాను, దేవుళ్ళు గాను పూజిస్తారు. వారే సారలమ్మ, సమ్మక్క, పైడితల్లమ్మ - సాయిబాబా, వీరబ్రహ్మము మొదలగువారు.

**ఆర్యులు :-** ఆర్యులు మధ్యఆసియా స్టెప్పీస్ గడ్డి భూములలో అభివృద్ధి చెంది, జనాభా పెరగడముతో, కొంతమంది పర్షియా ప్రాంతము (ఇరాన్)నకు వచ్చి స్థిరపడి అభివృద్ధి చెందసాగారు. కొన్ని వందల సం॥లలో మరలా జనాభా అభివృద్ధి చెంది, అందులో కొందరు పర్షియా వదలి, ఆఫ్ఘనిస్థాన్ మీదుగా నేటి పాకిస్థాన్‌లోనున్న సింధూపరివాహక ప్రదేశానికి చేరుకున్నారు. ఈ వలస తమ పశువులు, గుర్రాలు, చరాస్థులతో జరిగింది. ఆర్యులలో కొందరు పర్షియా నుండి వెళ్ళిపోవుటకు కారణం "వర్ణ వ్యవస్థ" వలన కలిగిన భేదాభిప్రాయాలే.

పర్షియాలో నుండగానే ఆర్యులు "ఋగ్వేదము" రచించారు. అప్పటి భాషలో ఋగ్వేదము వ్రాసారు. ఈ గ్రంథము "పార్శీ" వారి "జెండ్ అవస్తే" లాగానే వుంది. ఈ రెండు గ్రంథాలలో విషయాలు ఒక్కటే, కానీ కొన్ని ప్రాథమిక బేధాలున్నాయి. వీరంతా "అగ్ని"ని పూజించేవారు.

అయితే భారతదేశానికి వస్తూ "ఆర్యులు" తమ భాషను మార్పుచేశారు. వారు వస్తూ ఋగ్వేదము, గుర్రాలను, జానపద గాథలను తెచ్చుకున్నారు.

ఆఫ్ఘనిస్థాను నుండి భారతదేశములో ఆర్య తెగలు ప్రవేశిస్తుండగా, వారి మధ్య పశువులు కొరకు యుద్ధము జరిగినది. ఈ తెగలలో రెండు తెగలు బలమైనవి.

ఒక తెగకు "భరతుడు" ఇంకో తెగకు "విశ్వామిత్రుడు" నాయకులు. వీరిరువురూ కలసి మిగతా తెగలను ఓడించి వారిని తమ బానిసలుగా చేసుకున్నారు. ఈ బానిసలే తర్వాత శూద్రులలో భాగమయ్యారు. గెలిచిన తెగల నాయకుడయిన "భరతుని" పేరట హిందూ (సింధూ) దేశము "భారతదేశమని" పిలువబడింది.

పర్షియన్ భాషలో "స"ని "హ"గా పలుకుతారు.

ఈ ఆర్యతెగలు క్రీ॥పూ॥ 1500 సం॥లప్పుడు భారతదేశములో ప్రవేశించారు. వీరు "ద్రావిడుల"ను జయిస్తూ, వారి పట్టణాలు కాల్చివేస్తూ, వారిని బానిసలుగా చేసుకుంటూ వాయువ్యదిశ నుండి తూర్పు దిశగా "సుందర్ బన్స్" (నేటి వెస్ట్‌బెంగాల్‌లో నున్న అడవులు) వరకు తమ ఆధీనములోకి తెచ్చుకున్నారు. ఈశాన్య భారతములో అస్సాము ప్రాంతం వరకు కూడా చేరుకున్నారు. వింధ్య పర్వతములు దాటి దక్షిణ భారత ప్రాంతానికి పోలేదు. కొన్ని తెగలు వేరే తెగలుపై దాడులు చేస్తూ, ఆయా చోట్ల స్థిరపడుతూ చిన్న చిన్న రాజ్యాలను ఏర్పర్చుకున్నారు. వీటిని "జనపదము"లన్నారు. యుద్ధములలో ఓడినవారిని "బానిసలు"గా చేసుకుంటూ వారిని కూడా "శూద్రుల"లో కలిపేశారు. అందుకే శూద్రులలో "తెల్లని" ఆర్యులు "నల్లని" ద్రావిడులు "పసిమిఛాయ" టిబెటన్లు, మంగోలాయిడ్స్ వున్నారు. వీరు ఓడిపోయి బానిసలుగా చేయబడినవారు. ఆర్యుల బారి నుండి తప్పించుకొని, వింధ్య పర్వతములు దాటి దక్షిణ భారతదేశములో ప్రవేశించిన ద్రావిడులను – "దస్యుల"ను గాను, "రాక్షసుల"గాను "శూద్రులు"గాను ఆర్యులు పరిగణించారు. ఇదే వారి వేదాలలోను, సాహిత్యములోను కనుపడ్తుంది. ఒక మత గ్రంథములో – "ద్రావిడులు" రాక్షసులకు పుట్టారని వ్రాశారు.

వేదాలను ముఖస్త కంఠస్తం చేసి అభివృద్ధిపరచారు. ఆర్యులు "కురుక్షేత్ర" ప్రాంతానికి వచ్చే సరికి "ఋగ్వేదాన్ని" రెండు భాగాలుగా చేసి రెండో భాగానికి మరికొన్ని ఋక్కులను చేర్చి "యజుర్‌వేదాన్ని" రూపొందించారు. అలాగునే గంగానది వద్దకు వచ్చేసరికి మూడో వేదము "సామవేదాన్ని" రూపొందించారు. సుందర్‌బన్స్ చేరుకునే సరికి నాలుగో వేదమైన "అధర్వణ వేదాన్ని" రూపొందించారు.

ఈ నాలుగు వేదాలు "ఆర్యులు" భారతదేశములో ప్రవేశించిన 900 సం॥లలో రూపొందాయి.

ఆర్యులు క్రీస్తు పూర్వము 1500 సం॥లో భారతదేశములో ప్రవేశించి బాగా స్థిరపడుటకు సుమారుగా 1000 సం॥లు పట్టింది. దీనిని వేదకాలమంటారు. ఈ కాలములోనే జ్ఞానము, బలము, పరపతి వున్నవారు (విజేతలైన ఆర్యులలో) మూడు "వర్ణాలు"గా ఏర్పడ్డారు. జ్ఞానవంతులు "బ్రాహ్మణులు", బలాఢ్యులు "క్షత్రియులు", పరపతి, వ్యాపారము చేసేవారు "వైశ్యులు"గా ఏర్పడ్డారు. ఓడినవారు బానిసలుగా "శూద్రులు"గా పరిగణింపబడినారు. పై మూడు అగ్రవర్ణాలు - శూద్రులను అణగద్రొక్కి వారిని నానా విధమైన ఇబ్బందులకు గురిచేస్తూ వారి శ్రమను దోచుకున్నారు.

**<u>ఆర్యుల జీవన విధానము</u> :-** ఆర్యులు మొదట్లో మాంసాహారులు, యుద్ధప్రియులు, పశుపాలకులు, గుర్రాలను యుద్ధములోను, ప్రయాణాలకు, రధములు లాగుటకు, వ్యవసాయానికి వుపయోగించేవారు. రకరకాల ఆయుధాలు రూపొందించారు.

స్త్రీలను పురుషులతో సమానంగా చూసేవారు. ఇంటికి వచ్చిన అతిధులను బాగా ఆదరించేవారు. అతిథి ఇంటికి వస్తే గోవును వధించి విందు చేసేవారు. అందుకే అతిథిని "గోఘ్న" అని పిలిచేవారు. అంటే గోవును వధింపచేసినవాడు అని అర్థము.

సోమరసము (ఒక విధమైన కల్లు / సారా) త్రాగేవారు. ఇది తిప్పతీగ, పాలు, తేనె మొదలైనవి కలిపి తయారు చేస్తారు.

స్త్రీలు పునర్ వివాహము చేసుకోవచ్చు. స్వయంవరము ద్వారా భర్తలను ఎంచుకొనేవారు. ఏకపత్నీ వ్రతము అవలంభించేవారు.

కుల భేదాలు లేవు. ఒక తెగలో అందరూ సమానులే. కలిసి కట్టుగా పశు పాలన, వ్యవసాయం చేసేవారు. యుద్ధములో అందరూ పాల్గొనేవారు. అయితే కాలక్రమేణ ఈ జీవన విధానము మార్పుచెందింది. పురుషాధిక్యత పెరిగింది. స్త్రీల ప్రాముఖ్యత తగ్గింది. కారణం కుటుంబ పెద్ద యాజకుడుగా నుండి

మతపరమైన క్రతువులు జరిగిస్తూ కుటుంబంపై నియంత్రణ కలిగి వుండేవాడు. అందుకే పుత్రులకు ప్రాధాన్యత పెరిగింది. పుత్రికలు / స్త్రీలు కుటుంబ ఆస్తులుగా పరిగణింపబడేవారు. రజస్వల కాకముందే వివాహము, విధవా వివాహ నిషేధము, సతీ సహగమనము మున్నగు దురాచారాలు పెచ్చరిల్లాయి. స్త్రీలు మగవారితో పాటు కూర్చొని భోజనము చేయరాదు. చనిపోయిన బ్రహ్మచారులకు కన్యలను కట్టబెట్టి, వారిని అడవులకు పంపి క్రూరమృగముల పాల్జేసేవారు.

**మతము / దేవతారాధన :-**

జెండ్ అవస్తే లోను / ఋగ్వేదములోను వరుణుడు ముఖ్య దేవుడు. అగ్ని కూడా. మిగతావారు మిత్ర, ఆర్యమనుడు, భగుడు, దక్షుడు, ఇంద్రుడు, సూర్యుడు, చంద్రుడు, వివిధ గ్రహములు, యముడు, సోముడు. ఈ దేవుళ్ళందరూ మానవులను శాసించే వారని వారి నమ్మకము.

వీరు దేవ లేక దేవుస్ అని దేవున్ని సంభోధించారు. ఆకాశాన్ని "ద్యాష్‌పితర్" "జ్యూపిటర్", "జెయూస్ సాతెర్" అనే పేర్లలో తండ్రిగాను, భూమిని తల్లిగాను భావించారు. ఆకాశావరణమును "వరుణ" లేక "ఔరానాస్" అని పిలిచారు. అగ్ని (ఇగ్నీస్) ను ఆరాధించేవారు.

భారతదేశము చేరినాక ఆర్యులు "సింధూ" పరివాహక ప్రాంతములో నివసించారు. కాబట్టి పర్షియన్లు - ఆర్యులు భారతదేశములో అవలంభించిన మతాన్ని "హిందూ" మతము అన్నారు. గీతములతోను, ప్రార్థనలతోను కూడిన యజ్ఞ సంబంధమైన కర్మకాండ యీ కాలమున విస్తరించింది. ఈ కర్మకాండ జరిపే యాజకులు / పూజార్లు ప్రజలపై అధికారము నెరపేవారు. వీరే బ్రాహ్మణులు అయ్యారు.

చనిపోయినవారిని సమాధిగాని, దహనము గాని చేసేవారు. దహనము చేస్తే మంటల నుండి ఎగిసిపడే కీలలు చనిపోయిన వారిని దేవతల వద్దకు కొంచుపోవునని వారి నమ్మకము. వారు అమరత్వము పొంది దేవతలతో సమానముగా శక్తివంతులౌతారని వారి నమ్మకము. అందుకే పిత్రు దేవతలు, పిత్రుతర్పణ,

పిండప్రదానము అనే ఆచారాలు వచ్చాయి.

ఆర్యులకు "గోమాంసము", సోమరసము అంటే చాలా ఇష్టము. శతపథ బ్రాహ్మణములో "గోమాంసం" చాలా శ్రేష్టమైనదని చెప్పబడియున్నది.

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు పరస్పరము గౌరవించుకొని "ఉపనయనము" (జందెము ధరించడము) చేసేవారు. ఇది శూద్రులకు నిషేధము. జందెము ధరించెడివారు – ద్విజులు – రెండుసార్లు పుట్టినవారు. కావున వీరికి ఇంకో జన్మ అంటూ వుండదు. చనిపోయాక స్వర్గానికి చేరుకుంటారు. ద్విజులుకాని శూద్రులు ఎన్నో జన్మలు ఎత్తాలి. వారు పై మూడు వర్ణాలలో దేనిలోనైనా జన్మిస్తేనే స్వర్గప్రాప్తి.

మొట్టమొదట చనిపోయిన మానవుడు "యముడు" అయ్యాడని వీరి నమ్మకము.

భారతదేశము వచ్చాకనే ఈ వర్ణ కుల భేదములు, దురాచారాలు, మూఢమైన మత నమ్మకాలు, కర్మకాండలు, విచక్షణా పూరితమైన కట్టుబాట్లు పెచ్చరిల్లాయి.

**వర్ణ వ్యవస్థ :–** ఆర్యులు పర్షియాలో వుంటుండగానే వర్ణ వ్యవస్థకు అంకురార్పణ జరిగింది. ఇటువంటి వ్యవస్థను కొందరు ప్రతిఘటించారు. అందుకే ఆర్యులలో వర్ణవ్యవస్థకు అనుకూలముగా నున్నవారు పర్షియా వదలి ఆఫ్ఘనిస్థాన్ మీదుగా భారత దేశానికి వచ్చారు. ఈ వర్ణవ్యవస్థను సమర్థిస్తూ ఋగ్వేదములో నున్న మంత్రాలను కూడా మార్చివేశారు. సుమారుగా క్రీ॥పూ॥2000 సం॥ల ప్రాంతములో పుట్టిన ఈ వ్యవస్థను ఇంకా పటిష్టము చేయుటకు హిందూ శాస్త్ర గ్రంథాలలో అనేక విధమైన సంఘటనలను పేర్కొన్నారు. రామాయణ కాలములోను, సత్యయుగములోను ఈ వర్ణవ్యవస్థ ఉన్నది అని కొన్ని విషయాలు వ్రాశారు.

అయితే అందరూ ఒక విషయము ఆలోచించండి, కేవలము హిందూదేశములోనే అంటే హిమాలయ, వింధ్య పర్వతాల మధ్యనున్న ప్రదేశము లోనే, బ్రహ్మ తన ముఖము నుండి బ్రహ్మణులను, భుజములనుండి క్షత్రియులను, తొడల నుండి, వైశ్యులను, పాదముల నుండి శూద్రులను పుట్టించాడా?

ప్రపంచములో ఇంకా అనేకులు ఉన్నారు కదా! వారిని ఎవరు పుట్టించారు? బ్రాహ్మణుల కల్పిత రచనలలో / సాహిత్యములో / మత గ్రంథాలలో పైన పేర్కొన్న మూడు అగ్రవర్ణాలు - బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య - తప్ప హిందూ దేశములో అందరూ శూద్రులే సుమా! ద్రావిడులు రాక్షసుల నుండి పుట్టారని కూడా వ్రాశారు.

భౌద్ధమతము ఈ వర్ణవ్యవస్థను తృణీకరించింది. బలులను నిరసించి, జంతుబలులను వ్యతిరేకించి, అహింసను ప్రోత్సహించింది. స్త్రీలు, శూద్రులు భౌద్ధమతాన్ని స్వీకరించసాగారు. బ్రాహ్మణ మంత్రిత్వముతో విసిగిపోయిన రాజులు (క్షత్రియులు) కూడా భౌద్ధమతాన్ని ప్రోత్సహించారు. బ్రాహ్మణ యుగము (క్రీ॥పూ॥ 500 - 0 సం॥లు)లో జరిగిన ఈ పెను మార్పును బ్రాహ్మణులు తట్టుకోలేకపోయారు. వారి మనుగడే ప్రశ్నార్థకమైంది. బౌద్ధమతాన్ని దేశమునుండి నిర్మూలిస్తే గాని వారికి మనుగడలేదు. బుద్ధున్ని తొమ్మిదవ విష్ణు అవతారముగా పేర్కొన్నారు. రామాయణం, మహాభారతము, భాగవత పురాణాలు రచించారు. వింధ్య పర్వతములు దాటి బ్రాహ్మణులు దక్షిణ భారతములో నున్న ద్రవిడ రాజులను తమ తెలివితేటలతో మెప్పించి, వారి ఆశ్రయము సంపాదించి కల్పిత హిందూమతాన్ని వారిపై రుద్దారు. ద్రావిడులు పూజించే "లింగాన్ని" వారి **"నన్నా"** దేవున్ని అగ్ని సంబంధితుడు "రుద్రుడు"తో జోడించి "శివున్ని" సృష్టించారు. భౌద్ధాన్ని నిర్మూలము చేయడము ఆరంభించారు. భౌద్ధారామాలను కూల్చివేసి హిందూ దేవుళ్ళ / దేవతల మందిరాలను కట్టారు. ఆ విధంగా "ద్రావిడుల"ను హిందూ మతము అవలంభించేటట్లు చేశారు. ఇదంతా చరిత్ర, పురాణం కాదు.

ఈ వర్ణవ్యవస్థను క్రీ॥శ॥లో కూడా నిర్మూలించలేకపోయారు. ముస్లిమ్ రాజులు పట్టించుకోలేదు. బ్రిటిషర్స్ "శూద్రులను" "పంచములను" ఆదరించి వారికి చదువు చెప్పారు. అయినా సరే బ్రాహ్మణులు కూడా బ్రిటిష్ వారు నెలకొల్పిన విద్యాలయాలలో చేరి, ఇంగ్లీషు నేర్చుకొని, వారి తెలివితేటలతో వారిని మెప్పించి తమ ఆధిక్యతను నిల్పుకుంటూ వచ్చారు. వారికి అనుకూలంగా, బ్రిటిష్ వారు

ప్రవేశపెట్టిన సివిల్, క్రిమినల్ కోడులో కొన్ని అంశాలు పెట్టించారు. అవే నేటికి కూడా "హిందూ"లా" లో వున్నాయి. బ్రాహ్మణులకు అనుకూలముగా బ్రిటిష్ జడ్జీలు / కోర్టులు తీర్పులనిచ్చాయి.

స్వతంత్రము వచ్చాక "కాన్సుట్యూషన్ అసెంబ్లీ" లో వున్నవారు చాలామంది బ్రాహ్మణులే. వీరే ఒక రూలు పెట్టించారు. నిమ్నకులస్తులు (ఎస్.సి.లు) హిందూ మతము కాకుండా వేరే మతము అవలంభిస్తే అవి భారతదేశములో పుట్టిన మతాలైతే (బౌద్ధ, సిక్కు, జైన్ మున్నగు మతాలు) వారికి రిజర్వేషను ఇవ్వొచ్చు. అదే వారు విదేశీ మతాలు అవలంభిస్తే వారికి "రిజర్వేషన్లు" ఇవ్వరాదు. ఎందుకంటే క్రైస్తవ మతము అవలంభిన "నిమ్న కులస్తులు" విద్యాధికులు కావడమే కారణము. నేడు నిమ్మకులస్తులు వారి హక్కుల గురించి పోరాడుతూ "అంబెద్కర్" గార్ని ఆదర్శముగా తీసుకుంటున్నారు. అలాగుననే వారికి మేలు చేసిన "మిషనరీ" లను మర్చిపోతున్నారు. ఇది ఆలోచించవలసిన విషయము.

"అంబేద్కర్" గారు "వర్ణవ్యవస్థ" నే రద్దు చేయాలని మహాత్మ గాంధీ గార్ని కోరగా, మహాత్ముడు పట్టించుకోలేదు.

శూద్ర వర్ణమునుండి కులాలు ఏలాగు పుట్టాయో మను ధర్మశాస్త్రము చదివితే తెలుస్తుంది. ఆర్యులలో ఈలాంటి బుద్ధి వారు భారతదేశములో ప్రవేశించాక పుట్టింది. ద్రావిడులను జయించి, వారి పట్టణములను కాల్చివేసి ఉత్తర భారత దేశాన్ని ఆక్రమించారు. చాలామంది మగవాళ్ళను చంపివేసి, స్త్రీలను, కొంతమంది మగవాళ్ళను, వారి పిల్లలను దాసులు (బానిసలు)గా చేసుకున్నారు. ఓడిపోయిన ద్రావిడులు కొందరు వింధ్య పర్వతములు దాటి దక్షిణ భారత దేశములోనికి పారిపోయారు.

బానిసలుగా పట్టుబడిన వారిని రకరకాల పనులు కొరకు ఉపయోగించారు. వారిని శూద్రులు అన్నారు. బానిస స్త్రీలను తమ లైంగిక కార్యాలకు ఉపయోగించుకున్నారు. వారికి పుట్టిన పిల్లలను శూద్రులుగానే వ్యవహరించారు.

శూద్రులను నియంత్రించుటకు "స్మృతులను" సృష్టించారు. దేవుళ్ళే స్మృతులను వ్రాశారని శూద్రులు తలకెక్కించారు. చదువు లేని శూద్రులు అవన్నీ నిజమని నమ్మారు.

శూద్రులను సుమారుగా 3500 సంIIలు చదువులేని వారుగా చేశారు. వారిలో మూఢ నమ్మకాలు కలుగజేశారు. శూద్రులకు ఆస్తి హక్కులు లేకుండా చేశారు. శూద్ర స్త్రీలు అగ్రవర్ణాలు ముందు అర్ధనగ్నముగా వుండేటట్లు చేశారు. ఛాతీపై ఆచ్ఛాదన వుండకూడదు. ఋగ్వేద కాలములో ఆర్య స్త్రీలు పూర్తి స్వాతంత్రము కలిగి వుండేవారు. బాల్య వివాహాలు లేవు, ఘోషాలేదు, సహగమనము లేదు, స్వయంవరములుండేవి. స్త్రీలు పునర్ వివాహములు చేసుకొనేవారు. ఏకపత్నీ వ్రతము సాధారణము. బహు భార్యాత్వము చాలా కొద్దిమంది కలిగి వుండేవారు. భారతదేశములో ఆర్యులు ప్రవేశించాక, వర్ణవ్యవస్థ ఏర్పడి, స్త్రీలు స్వాతంత్ర్యము మెల్లి మెల్లిగా కోల్పోయారు.

ఆర్యులలో మధుపానము, మాంసాహార భోజనము అతిసాధారణము. ఇంటికి వచ్చిన అతిథికి గోమాంసము పెట్టుట ఆచారము. అందుకే అతిథిని "గోఘ్న" అనేవారు. అంటే గోవును వధింపజేయువాడు అని అర్థము. గోమాంసము శ్రేష్ఠమైనదని శతపథ బ్రాహ్మణము చెప్పుచున్నది. ఈ ఆహారపు అలవాటు ఆర్యులు భారతదేశానికి వచ్చాక మారసాగింది.

వేదకాలములో ఆర్యుల ప్రధాన వృత్తి వ్యవసాయము, పశుపాలన, వర్ణవ్యవస్థ ఏర్పడ్డాక వృత్తులు మారాయి. ఉపనిషత్తుల కాలానికి అనేక మార్పులు కలిగాయి. వేదకాలములో ముఖ్య దేవుళ్ళు – ఇంద్రుడు, వరుణుడు, సోముడు, అగ్ని. తర్వాత వీరి ప్రాముఖ్యత తగ్గి కొత్త దేవుళ్ళు ఏర్పడ్డారు. ముఖ్యముగా బ్రాహ్మణ యుగములో, భౌద్ధమతం బ్రాహ్మణుల మనుగడను ప్రశ్నార్థకము చేసింది.

# అధ్యాయము-7

## హిందూ మతము - వేదములు - మతగ్రంథాలు.

వేదాలు చాలా పురాతనమైనవి అని చెప్తారు. దేవుడే వ్రాశాడు. మనుషులు వ్రాయలేదు అని కూడా చెప్తారు. అయితే హిందూమత గ్రంథాలు ఏమని చెప్పాయి. వేదము అనగా "తెలిసుకొనుట" "విద్" అను సంస్కృత పదము నుండి పుట్టింది. వేదమనగా "దేవుని యొక్క జ్ఞానము". వేదమును "శృతి" అన్నారు. "శృతి" అనగా "చెవిని పడేది".

వేదములు ఏలాగు పుట్టాయి? మతగ్రంథాలు ఏమని చెప్తున్నాయి?

**ఋగ్వేదము** : పురుష అను దేవతనర్చించుట వలన పుట్టాయి.

**భాగవతము** : గుఱ్ఱపు ముఖముగల దేవుని నాసికా రంధ్రముల నుండి పుట్టాయి.

**అధర్వణ వేదము** : కత్తిరించిన లేక గీరి తీసిన స్కంభుని యొక్క వెంట్రుకలు గాని నోరు గాని... వేదాలుగా పుట్టాయి.

**శతపథ బ్రాహ్మణము** : (1) పరమాత్ముని శ్వాసములు.. నుండి పుట్టాయి

" (2) దేవతలు వేదములను మనస్సు అనే సముద్రములోనుండి త్రవ్వి తీసారు.

**భాగవతము** : బ్రహ్మ నాలుగు ముఖముల నుండి నాలుగు వేదాలు పుట్టాయి.

**అధర్వణ వేదము** : ఇంద్రుని నుండి పుట్టాయి.

" : కాలము నుండి పుట్టాయి.

" : అర్పణల యొక్క శేషము నుండి పుట్టాయి.

**తైత్తరీయ బ్రాహ్మణము** : ప్రజాపతి యొక్క గడ్డపు వెంట్రుకలు.

" : "వాక్కు" వేదముల తల్లి

**విష్ణు పురాణము** : విష్ణువు యొక్క స్వరూపము

**శాంతి పర్వము** : సరస్వతి వేదముల తల్లి
**భాగవత పురాణము** : బ్రహ్మ నోట నుండి పుట్టాయి
**కూర్మ పురాణము** : పార్వతి వలన పుట్టాయి
**హరివంశము** : గాయత్రి నుండి పుట్టాయి
**చాంధోగ్యోపనిషత్తు** : అగ్ని, వాయువు, సూర్యుడి నుండి మొదటి మూడు వేదములు పుట్టాయి.

**ఏది నిజము?**

**దేశ, విదేశీ పరిశోధనలు కనుగొన్న నిజములు :-** ఆర్యులు పర్షియాలో నుండగా "ఋగ్వేదము" వ్రాయబడినది. సుమారుగా క్రీ॥పూ॥ 2000-1700 సం॥లలో వ్రాయబడినది. ఋషులు, రాజులు, రాజర్షులు, స్త్రీలు కూడా ఋగ్వేదమంత్రములు వ్రాసారు.

ఆర్యులు పర్షియాలో ఉండగానే "ఋగ్వేదము" లో వర్ణవ్యవస్థను మంత్రరూపములో ప్రవేశపెట్టారు. ఇది నచ్చని వారు ప్రతిఘటించగా ఒక తెగ పర్షియా నుండి భారతదేశానికి వస్తూ వారితో పాటు ఋగ్వేదము, కొన్ని జానపద కథలు తీసుకొని వచ్చారు. పర్షియాలో నుండిపోయిన తెగ "జెండ్అవస్తే" ను తమతో వుంచుకున్నారు. ఋగ్వేదము, జెండ్అవస్తే లలో నున్న విషయములు ఒకేలా వుంటాయి. భారతదేశము వస్తూ ఆర్యులు "సంస్కృత" భాషను పుట్టించి అభివృద్ధి చేశారు. వీరు "అగ్ని" ని పూజించేవారు.

"ఋగ్వేదము" - పర్షియాలో కూర్చబడినది. మిగిలిన మూడు వేదములు - యజుర్వేదము, సామ వేదము, అధ్వరణ వేదము, క్రీ॥పూ॥ 900-400 సం॥లలో కూర్చబడినవి.

అసలు విషయము ఏమిటంటే వేదాలను మనుష్యులే వ్రాసారు. ఋషులు, బ్రాహ్మణ పండితులు వ్రాశారు. ఇవి సంస్కృతములో వుండుట వలన ప్రజలకు వాటి అర్థాలు తెలియవు. దేవుని మాటగా ప్రజలను నమ్మించారు.

**(1) ఋగ్వేదము : ఋక్ = స్తుతి**

ఇది అగ్ని, ఇంద్రుడు, వరుణుడు, సూర్యుడు, సోముడు మిత్ర అనే ముఖ్య దేవుళ్ళను స్తుతించే మంత్రాలతో కూడుకున్నది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ఎలాంటి ప్రాముఖ్యత లేదు. ఇందులో 10 మండలములు, 1017 సూక్తములు, 10580 మంత్రములు, 1,58,826 శబ్దాలు, 4,32,000 అక్షరాలున్నాయి.

**(2) యజుర్వేదము:** ఆర్యులు సింధూ ప్రాంతము నుండి "కురుక్షేత్రము" చేరుకున్న తర్వాత అంటే క్రీ॥పూ॥ 600-500
సం॥లలో వ్రాయబడింది.

**(ఎ) శుక్లయజుర్వేదము :** యాజ్ఞవల్క్య మహర్షిచే వ్రాయబడినది. 1975 పద్య, గద్యములున్నవి.

**(బి) కృష్ణ యజుర్వేదము :** తైత్తరీయ (తిత్తరి) మహర్షిచే వ్రాయబడింది. ఇందులో 2198 మంత్రాలు, 19200 పదాలున్నాయి.

పై రెండింటిలో నున్న మంత్రాలు, చాలా వరకు ఋగ్వేదము నుండి సంగ్రహించబడినవి. ఇవి యజ్ఞయాగాది క్రతువులు జరిగించే విధానము తెలిపే వేదాలు.

**(3) సామవేదము :** ఈ వేదము ఆర్యులు గంగా నది వద్దకు క్రీ॥పూ॥ 500-400 సం॥ చేరుకునేటప్పుడు వ్రాయబడింది. నాలుగు వేదాలలో చిన్నది, దేవతలను ప్రసన్నము చేసుకొనే గాన, సంగీతములను తెలియజేస్తుంది. సమాధానము, సఖ్యత కలుగజేసేది. ఇందులో 1875 మంత్రాలున్నాయి. 1504 మంత్రాలు ఋగ్వేదములో నున్నవే. 99 కొత్తవి 272 పునరుక్తాలు (రిపీట్ చేయబడినవి). ఇది శాంతి వేదము. భారతీయ సంగీత శాస్త్రానికి మూలము.

ఆర్యులు గంగానది వద్దకు చేరుకొనే సరికి సూర్యుని వేడికి తాళలేక, సూర్యుని ప్రాముఖ్యత తగ్గించివేశారు.

**(4) అధర్వణ వేదము :** ఆర్యులు వారణాసి చేరుకునే సరికి, క్రీ॥పూ॥ 500-400 సం॥లలో వ్రాయబడింది. ఈ వేదములో ఆరోగ్య చికిత్స, మంత్ర విద్య, గారడీ విద్య, జ్యోతిష్యము, న్యాయశాస్త్రములు, రాజనీతి మొదలగు విషయాలున్నాయి.

ఇందులో 5977 మంత్రాలున్నాయి. 1200 మంత్రాలు ఋగ్వేదము నుండి సంగ్రహింపబడినవి. చాలా విషయాలు పురాతనమైనవి. పూజా విధానము, క్రూరకర్మలతో కూడినది. దీనిని "శాప" వేదమని పిలుస్తారు.

ఆర్యులు వారణాసి ప్రాంతానికి వచ్చాక సుందరబన్స్ (వెస్ట్ బెంగాలులోనున్న అడవులు), గంగానది, బంగాళాఖాతము, పెద్ద పులులు, చిరుత పులులు గురించి తెలుసుకున్నారు. సింహానికి ప్రాముఖ్యత తగ్గింది. పెద్ద పులికి ప్రాధాన్యత పెరిగింది.

వేదాలు అపౌరషేయాలు (దేవుళ్ళచే చెప్పబడినవి) అని వీటికి అక్షర రూపము ఇవ్వలేదు. గురుముఖః శిష్యులు నేర్చుకోవాలి. కంఠతాపెట్టాలి. కావున వేదార్థములు కాలక్రమేన మారిపోయాయి. క్రీ॥పూ॥400–300 సం॥లో వీటిని తాళపత్రములపై లిఖించారు. మరలా క్రీ॥శ॥ 18-19 శతాబ్దాలలో లిఖించారు. కీ॥శే॥దాశరథి రంగాచార్య గారు వేదాలను తెలుగులో ప్రచురించి బ్రాహ్మణుల నిరసనకు గురయ్యారు.

వేదాలు అర్థము చేసుకొనుటకు 6 వేదాంగాలు, 4 ఉపవేదాలున్నాయి.

**వేదాంగాలు** : శిక్ష, వ్యాకరణము, నిఘంటు, చందస్సు, జ్యోతిష్యము, కల్పము.

**ఉపవేదాలు** : గాంధర్వవేదము, ఆయుర్వేదము, ధనుర్వేదము, అర్థవేదము.

**వేదాలు** మంత్రభాగము, కర్మ గురించి చెప్పేవి. **బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు.** ఇవి జ్ఞానభాగాలు.

**బ్రాహ్మణాలు** : యజ్ఞయాగాది కర్మకాండలు జరిపే విధానాలు తెలిపేవి. ఇవి మొత్తం 70. కానీ 21 మాత్రము వ్యవహారములో వున్నాయి. ఋగ్వేదమునకు-2, యజుర్వేదానికి-10, సామవేదానికి-8, అధ్వరణవేదానికి-1, మనము తరచుగా వినే బ్రాహ్మణాలు- **ఐతరేయ, తైత్తరీయ, శతపథ, తాంఢ్య, పంచవింశ, గోపత బ్రాహ్మణాలు.**

**అరణ్యకాలు** : ఇవి కూడా వేదానికి 1,2 చొప్పున వున్నాయి. ఋషులు అడవులలో రచించి వాడుకునేవి.

**ఉపనిషత్తులు** : 250/350 వున్నాయని **అంటారు.** 108 ఉపనిషత్తుల జాబితా

వుంది. అందులో 13 మాత్రము వాడుకలో వున్నాయి. ఇవి ఋషులు బ్రాహ్మణ పండితులు వ్రాశారు. క్రీ॥పూ॥ 1000-400 సం॥లలో వ్రాయబడినవి.

**సూత్రాలు** : యజ్ఞయాగాది కర్మలు చేసేటప్పుడు, మంత్రాలు గుర్తుంచుకొనుటకు టూకీగా వ్రాయబడిన చిన్న, చిన్న వాక్యాలు. ఇవి శ్రౌత, గృహ్య, బ్రహ్మ సూత్రాలు.

**శాస్త్రాలు** : ధర్మశాస్త్రములు, అర్థ శాస్త్రములు, ఆగమశాస్త్రాలు. పైన పేర్కొన్నవి స్మృతులు, చాలా వరకు లిఖించబడినాయి.

**స్మృతులు** : ఇతిహాసాలు, పురాణాలు, ధర్మశాస్త్రాలు (స్మృతులు).

**శాఖా పారంపర్య గ్రంథాలు :-**

(1) వైష్ణవ సంహితము

(2) శై వాగమములు

(3) శక్తి తంత్రములు

**ధర్మశాస్త్రాలు :-**

అసలైన స్మృతులు కొన్ని వున్నాయి. మనుస్మృతి, పరాశరస్మృతి, వేదవ్యాస స్మృతి మున్నగునవి. ఇది ఇండియన్ పీనల్ కోడ్ (శిక్షాస్మృతి) లాంటివి. కానీ చాలా ఘోరమైనవి.

శూద్రులను తమ చెప్పు చేతలలో వుంటుకొనుటకు, స్త్రీలను అణగద్రొక్కుటకు ఈ స్మృతులను బ్రాహ్మణులు వ్రాసి అవి దేవుళ్ళు వ్రాసారని చెప్పారు.

మచ్చుకు మను ధర్మశాస్త్రము ఏమంటుంది -

స్త్రీ చపలచిత్తురాలు. పురుషున్ని చెరుపుతుంది. కామాతురత బుద్ధి గలది.

స్త్రీ పెళ్ళికాకముందు తండ్రి ఆధీనములో, పెళ్ళిఅయ్యాక భర్త ఆధీనములో వుండాలి.

స్త్రీ పురుషుని ఆస్తి. యవ్వనములో భర్త చనిపోతే శిరోముండనము చేసుకొని, తెల్లబట్టలు కట్టుకొని, గాజులు, నగలు, బొట్టు లేకుండా బ్రతకాలి. ఇంటిల్లి పాదికి

సేవ చేయాలి. బయటకు కనపడకూడదు. కనపడితే అశుభము. కాబట్టి శుభకార్యములలో పాల్గొనకూడదు. పూర్తిగా ఆహారము తినకూడదు, పస్తులుండాలి. ఇంట్లో అందరూ తిన్నాక ఏమైనా మిగిలితే తినాలి.

స్త్రీకి స్వతంత్రముండకూడదు. "న:స్త్రీ స్వతంత్ర మర్హతి".

స్త్రీలు చదువుకోకూడదు.

అందరూ తిన్నాక స్త్రీలు తినాలి.

హిందూ శాస్త్ర గ్రంథాలు బ్రాహ్మణులే వ్రాసి, ప్రజలలో నమ్మకము కలుగజేయుటకు అవి దేవుడే వ్రాశాడని, ఋషులు వ్రాసారని, వాల్మీకి, వేదవ్యాసుడు, కృష్ణుడు, మనువు వ్రాసారని చెప్పారు. ఈ గ్రంథాల వుద్దేశము – రాజుల ప్రాపకము కొరకు, స్త్రీలను, శూద్రులను అణగద్రొక్కి తమ పబ్బము గడుపుకొనుటకు. **రామాయణం, మహాభారతము** ఇతిహాసాలు. **పురాణాలు**, త్రిమూర్తులకు సంబంధించినవి 18 మహా పురాణాలు. ఇంకో 18 ఉప పురాణాలు. స్మృతులలో ముఖ్యమైనది **మనుస్మృతి**. వేరేవి నారదస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి, పరాశరస్మృతి మున్నగున్నవి. ఇంకా స్థలపురాణాలు, స్కంథపురాణాలున్నాయి. **ధర్మసూత్రాలు** – గౌతమ, భౌద్ధాయణ, వశిష్ట సూత్రాలు. **"భగవద్గీత"** అసలు మహాభారతములో లేదు. క్రీస్తు శకములో వ్రాసారు. హిందూ మత గ్రంథాలు గురించి వ్రాయాలంటే కొన్ని వేల పేజీలు వ్రాయాలి.

ఆర్యులలో బ్రాహ్మణులు హిందూ మత గ్రంథాలు వ్రాశారు. ఇది నిర్వివాదాంశము. దేవుళ్ళు వ్రాయలేదు. బ్రాహ్మణులే దేవుళ్ళను సృష్టించారు. ఆర్యులు తమతో తెచ్చుకున్న జానపదగాధలను విస్తృతపరచి ఇతిహాసాలు పురాణాలు వ్రాసారు. ప్రజలను తమ చెప్పుచేతలలో వుంచుకొనుటకు ధర్మసూత్రాలు, స్మృతులు వ్రాసారు.

దీనికి కారణము క్రీ॥పూ॥ 563 సం॥లో సిద్ధార్థ గౌతముడు పుట్టాడు. బోధి వృక్షము క్రింద జ్ఞానము కలిగి – "గౌతమ బుద్ధుడై"య్యాడు. బౌద్ధమతము స్థాపించాడు. అహింస, వర్ణరహిత సమాజము, స్త్రీ, పురుష సమానత్వము బౌద్ధానికి

పునాది, బ్రాహ్మణుల పెత్తనానికి, వర్ణవ్యవస్థకు వ్యతిరేకులైన ప్రజలు "భౌద్ధమతాన్ని" అవలంభింపసాగారు.

బ్రాహ్మణుల ప్రాబల్యము తగ్గసాగింది. వారి మనుగడే ప్రశ్నార్థకము అయింది. అందుకే లేనిపోనివి కల్పించి, అనేక గ్రంథాలు వ్రాసి, కల్పితములు, అబద్ధములైన వాటిని ప్రచారము చేసి ప్రజలలో భయము కల్గించారు. కాలక్రమేణ బౌద్ధమతమును భారతదేశము నుండి పారద్రోలారు. ఇది చారిత్రక సత్యము. దక్షిణభారతదేశములో భౌద్ధారామాలు కూల్చివేసి శివ మందిరాలు కట్టించారు. పుష్యమిత్రుడు అనే బ్రాహ్మణ మంత్రి భౌద్ధుడైన రాజును చంపించి సేనాధిపతిని రాజుగా చేసాడు.

చదువురాని స్త్రీలు, శూద్రులు - బ్రాహ్మణులు చెప్పిన విషయములను నమ్మారు. ఏ వ్యక్తికైనా ఏమైనా "చెడు" జరిగితే అది ఫలానా దేవుడు చేశాడు అనే కర్మ సిద్ధాంతముతో ప్రజలను మభ్యపెట్టి, దానికి విరుగుడు మా వలనే జరుగుతుందని బ్రాహ్మణులు తమ పబ్బము గడుపుకోసాగారు. దేవుడంటే భయము పుట్టించారు. కర్మసిద్ధాంతము, పునర్జన్మ సిద్ధాంతము వారి తలలో గాఢంగా నాటారు.

ఈ విధముగా ప్రజలు మతమనే మూఢత్వానికి గురిఅయ్యారు. ఈ ప్రక్రియ సుమారు 3000 సం॥ కొనసాగింది. దేశము వెనుకబడిపోయింది. ప్రజలు బ్రాహ్మణుల గుప్పెట్లోకి పోయి దేశములో అనేక అనర్థాలకు లోనయ్యారు.

**దేశ, విదేశీ పరిశోధకుల ప్రకారము -**

ఋగ్వేదము - క్రీ॥ పూ॥ 2000 - 1700 మధ్యను మిగిలి మూడు వేదాలు - క్రీ॥పూ॥ 1500 -500 మధ్యను వ్రాసారు. ఆలాగుననే బ్రాహ్మణాలు, ఉపనిషత్తులు, అరణ్యకాలు కూడా క్రీ॥పూ॥ 1500-800 మధ్యను వ్రాసారు.

ఇతిహాసాలు క్రీ॥పూ॥ 500సం॥ల కాలములో వ్రాసారు. భగవద్ గీత క్రీ॥శ॥ 1000 లో వ్రాసారు. కొన్ని పురాణాలు క్రీ॥శ॥ 1000 సం॥ల వరకు వ్రాసారు. ఇవి ఆర్యులు తమతో తెచ్చుకున్న జానపదగాధలను బట్టి వ్రాసారు.

క్రీస్తు పూర్వము 563 సం॥లో బుద్ధుడు పుట్టగా, ఆయన బోధలు ద్వారా బౌద్ధమతము వ్యాప్తిచెందింది. బ్రాహ్మణులు దౌష్టికాన్ని భరించలేని వారు, స్త్రీలు,

శూద్రులు, రాజులు బౌద్ధాన్ని ఆదరించారు. బ్రాహ్మణుల వునికికి, మనుగడకు ముప్పు వాటిల్లింది. అందుకే వారు క్రీ॥పూ॥ 500 సంవత్సరాలలో స్మృతులను వ్రాసారు. అవి అబద్ధమైననూ "నిజమని" నమ్మించగలిగారు. భారతదేశము నుండి బౌద్ధాన్ని తొలగించ గలిగినారు. అది ఈ దేశ దౌర్భాగ్యము.

రామాయణం, భారతం, మనుస్మృతి గురించి కొంతవరకు తెలుసుకుందాము. ఆర్యులు భారతదేశానికి వస్తూ వారితో పాటు గుఱ్ఱాలను, ఋగ్వేదాన్ని, జానపద గాథలను తీసుకొని వచ్చారు. జానపదగాథల్ని – ఇతిహాసాలుగా తీర్చిదిద్దారు. ముఖ్యముగా బౌద్ధమతాన్ని నిలువరించుటకు, స్త్రీలు, శూద్రులను మానసికంగా తమ ఆధీనములో వుంచుకొనుటకు వ్రాసినవీ ఇతిహాసాలు.

## రామాయణం

కృతయుగములో విష్ణువు 5 అవతారాలు ఎత్తాడు. చివర్లో ఆరో అవతారము "పరశురాముడు" ఎత్తాడు. పరశురాముడు బ్రతికి వుంటుండగానే "రాముడు" గా త్రేతాయుగములో అవతరించాడు.

(1) ఇందులో బ్రాహ్మణులు నీతి ఏమిటంటే స్త్రీలు – పురుషులకు (భర్తలకు) విధేయులుగా పడి వుండాలి. అవసరమైతే తన పాతివ్రత్యాన్ని నిరూపించుకొనుటకు ప్రాణము కూడా పణముగా పెట్టాలి.

(2) వర్ణ వ్యవస్థ పటిష్టముగా వుండాలి. అందుకే క్రీ॥పూ॥ 1700–1500 సం॥లలో ఋగ్వేదములో పుట్టిన "వర్ణవ్యవస్థ" రామాయణ కాలములో కూడా వున్నదని. శూద్రుడు తపస్సు చేయుట వలన ఒక బ్రాహ్మణ బాలుడు (ఒక్కడే, ఎక్కువ మంది కారు) మరణించాడు. వాడిని బ్రతికించాలంటే, బ్రాహ్మణుల కోరిక ప్రకారము తపస్సు చేయుచున్న శూద్రున్ని, రాజుగా నున్న రాముడు, కనుగొని చంపాలి. "శంభూకుడ" నే శూద్రుడు తపస్సు చేసుకుంటూ రాముడికి కనపడ్డాడు. తన ఖడ్గంతో రాముడు వాడి తల నరికాడు. ఇది ధర్మరక్షణ.

(3) కోతులు నేటికీ జంతువులు. బహుశా బ్రాహ్మణుల కట్టుకథను "రక్తి" కట్టించడానికి త్రేతాయుగములో కోతులు మనుష్యులు మాట్లాడేటట్లు

మాట్లాడేవేమో!. రాజ్యాలు ఏర్పర్చుకున్నాయేమో!. హనుమంతుడు బలమైన శక్తివంతుడు. వాలి, సుగ్రీవులు అన్నదమ్ములు.

హనుమంతుడు సూర్యుని "ఎర్రని పండు"గా భావించి తినడానికి అంతరిక్షము లోకి ఎగిరాడట. ఆక్సిజన్ లేకుండా కూడా కోతులు జీవించగలవేమో!.

బలిష్టుడైన అన్న "వాలి" తమ్ముడైన సుగ్రీవుని అడవులలోనికి తరిమేశాడు. ఇది రాజధర్మము. కోతులకు కూడదు. మనుష్యులకే సుమా!.

సుగ్రీవుని సహాయము పొందుటకు రాముడు, వాలిని, చాటుగా వుండి చంపేశాడు. జంతువులను వేటాడుట "క్షత్రియ" ధర్మము.

(4) రాక్షసులు అనే వారు వుంటే వారి భారీ కాయానికి వుండే పెద్ద ఎముకలను, పరిశోధకులు ఈ పాటికి త్రవ్వి తీసియుందురు. ఆర్యుల దృష్టిలో "ద్రావిడులు" దాసులు, దస్యులు, రాక్షసులు. ద్రావిడులు రాక్షస సంతానమని హిందూ మత గ్రంధాలు చెబుతున్నాయి.

(5) కోతులతో లంకకి వారధి కట్టబడిందా? అది ఒక "ఆర్చిపెలాగో" అని శాస్త్రజ్ఞులు తేల్చివేశారు కదా!.

(6) "మాయలేడి" అని విష్ణువు అవతారమైన రాముడికి తెలియదా?

(7) లేడి వేటకు బయలుదేరిన రాముడు సీతకు కాపలాగా లక్ష్మణున్ని పెట్టాడు. " హా! లక్ష్మణా!" అని అడవిలో నుండి వినపడిన ఆర్తనాదము రాముడిదిగా భావించి – సీత – లక్ష్మణున్ని వెళ్లి చూడమంది. అన్న ఆజ్ఞని పాటించే లక్ష్మణుడు పోనన్నాడు. పతివ్రతయైన సీత లక్ష్మణుడు తనపై కన్ను వేశాడు కాబట్టి తన మాట విని పోవడము లేదని నిష్టూరమాడింది.

(8) అన్నీ వేదాలలో "ఉన్నాయ[illegible]ని నేటికీ బ్రాహ్మణులు అంటూ వుంటారు. "పుష్పక విమానము" ఈ రోజు మనకు వుంటే అసలు విమాన ప్రమాదాలే వుండేవి కావు.

(9) చాకలి (శూద్రుడు) వాడు తన భార్యతో రాముడు గురించి చులకనగా మాట్లాడాడు. మరి చాకలి వాడిని వధించకుండా, నిండు గర్భవతియైన సీతని

అడవులకు పంపించాడు. నేటికీ ఈ కథ విన్న "స్త్రీలు" విలపిస్తారు.

(10)రామాయణము వాల్మీకి వ్రాశాడు. శూద్రుడు వ్రాసిన ఇతిహాసాన్ని బ్రాహ్మణులు ఏలాగు అంగీకరించారు? వాడిని దండించి చెవులు, నాలుక, పిర్రలు కోసేయాలి. చేతులు నరికేయాలి కదా!.

అందుకే కొందరు బ్రాహ్మణులే "రామాయణం రంకు, భారతము బొంకు" అనే నానుడి ప్రచారములోకి తెచ్చారు.

## మహాభారతము

ఈ ఇతిహాసాన్ని, పురాణాలను వ్యాసుడు వ్రాశాడు. ఎవరీ వ్యాసుడు?

"అద్రిక" ఒక అప్సర. శాపవశాన "చేప"గా మారి యమునా నదిలో వుంది.

చేడి రాజు వేటకు వెళ్ళాడు. భార్యను తలచుకుంటూ "వీర్యము"ను స్ఖలించాడు. ఆ వీర్యాన్ని ఏలాగు పట్టుకున్నాడో తెలీదు గాని, ఒక గద్దకి ఇచ్చి తన రాణి యొద్దకు పంపాడు. దారిలో ఈ గద్ద ఇంకో గద్దతో తలపడడము వలన ఆ "వీర్యము" యమునా నదిలో పడింది. అద్రిక చేప దాన్ని మింగి గర్భవతియైంది. (ఈలాగున మనకు తెలియని కాలములలో బ్రాహ్మణులు, పక్షుల ద్వారా, జంతువుల ద్వారా, చేపల ద్వారా మనుష్యులను పుట్టించారు).

గర్భము ధరించిన అద్రిక చేప దశరాజు (జాలరి వాళ్ళ నాయకుడు) కి దొరికింది. చేపను కోయగా ఒక బాలుడు, ఒక బాలిక అందులో వున్నారు. వారిద్దరిని రాజుగారికి ఇవ్వగా రాజు బాలున్ని వుంచుకొని, బాలికను దశరాజుకిచ్చేశాడు. దశరాజు ఆ బాలికను పెంచుకున్నాడు. ఆమె నల్లనిది. దశరాజు పడవను కూడా నడిపి ప్రజలను నది దాటించేవాడు. దశరాజు పెంచుకున్న బాలిక కూడా పడవ నడిపేది. ఆమె శరీరము చేపకంపు కొట్టేది. ఆమె పేరు "సత్యవతి" అయినా కంపు వలన "మత్స్యగంధ" అన్న పేరు కూడా పొందింది.

నల్లనిది అయినా ఆమె చక్కనిది. అద్రిక చేప అప్సర కదా!.

"పరాశరుడు" ఒక ఋషి. బ్రాహ్మణుడు. ఒకసారి యమునా నది దాటుటకు సత్యవతి నడుపుతున్న పడవ యెక్కి సత్యవతిని మోహించి ఆమెకి వరాలిచ్చి ఆమెను

కూడాడు. ఇచ్చిన వరాల వలన (1) ఆమె శరీరం సువాసన (కస్తూరి వాసన) పొంది "యోజన గంధి" గా పేరు పడింది. (2) పరాశరుని ద్వారా "వ్యాసుని" కన్నది. (3) వ్యాసుని కన్నాక కూడా ఆమె కన్యగానే వుంది (కన్యాత్వము పోలేదు).

పరాశురుడు ఆమెను కూడిన రోజే గర్భవతియై నదిలో నున్న చిన్న లంకలో "వ్యాసున్ని" కన్నది. అదే రోజు వ్యాసుడు ఒక యువకుడిగా పెరిగి అడవిలో తపస్సు చేసుకోవడానికి పోతూ "ఎప్పుడు పిలుస్తే, అప్పుడు వస్తానని తల్లియైన "సత్యవతి" కి వాగ్ధానము చేసాడు. ఈతడు కూడా నల్లనివాడు కానీ అందవిహీనుడు. ఈతడే వేదాలను, పురాణాలను, మహాభారతాన్ని వ్రాశాడట. అందుకే "వేద వ్యాసుడ"య్యాడు. "కృష్ణ" (నల్లని వాడు) ద్వీపముపై పుట్టాడు కాబట్టి "ద్వైపాయునుడు" అందుకే వ్యాసున్ని "కృష్ణ ద్వైపాయునుడు"గా పిలుస్తారు.

తర్వాత సత్యవతి శంతను మహారాజుని పెండ్లాడింది. చిత్రాంగదుడు, విచిత్ర వీర్యుడు పుట్టారు. చిత్రాంగదుడు పెళ్ళికాక మునుపే అదే పేరు గల గంధర్వునిచే చంపబడ్డాడు. విచిత్ర వీర్యునికి, భీష్ముడు కాశీరాజు పుత్రికలైన అంబిక, అంబాలికను తెచ్చి పెళ్ళి చేసాడు. శోభనము కాకముందే విచిత్రవీర్యుడు చనిపోయాడు. సత్యవతికి మనవలు కావాలి. కాబట్టి "బ్రాహ్మణుడైన" వ్యాసుని (పెద్దకొడుకు)చే కోడళ్లిద్దరికి పిల్లలు పుట్టించింది. బహిష్ఠులో నున్న అంబికని వ్యాసుడు కూడాడు.

వ్యాసుని నల్లని కురూపిగా చూసిన అంబిక కళ్లు మూసుకొనగా రతి జరిగింది. కాబట్టి "దృతరాష్ట్రుడు" గుడ్డివాడుగా పుట్టాడు. రెండో కోడలు అంబాలికను కూడుటకు వచ్చిన వ్యాసున్ని చూసి ఆమె ముఖము పాలిపోయింది. పాలిపోయిన ముఖముగల అంబాలికను వ్యాసుడు కూడగా "పాండురాజు" పుట్టాడు. సత్యవతి మరలా ప్రేరేపించగా వ్యాసుడు - అంబికను కూడుటకు రెండోసారి వచ్చాడు. అంబిక వ్యాసునిచే రతి చేయించుకొనుటకు ఇష్టపడక తన దాసీని (శూద్రస్త్రీ) తన బదులు వ్యాసునితో రతి జరిపించగా "విదురుడు" పుట్టాడు.

యమునికి ఒక శాపముంది. ఒక 12 ఏళ్ళలోపు బాలున్ని యముడు శిక్షించాడు. అది తప్పు కాబట్టి - యముడు శూద్ర యోనిలో నుండి మానవుడిగా పుట్టాడు. అతడే "విదురుడు".

దృతరాష్ట్రుడు గాంధారిని పెండ్లి చేసుకొని 100 గురు కొడుకులను కన్నాడు. (టెస్ట్ ట్యూబ్ బేబీస్) ఒక కూతురుని (దుశ్శల) కూడా కన్నారు. వీరు కౌరవులు. పాండురాజు స్త్రీని కూడితే చస్తాడని ఒక జంతువు శపించింది. ఈతనికి కుంతి, మాద్రి భార్యలు. కుంతి పెళ్ళికి ముందే "దూర్వాసుని" వరముతో సూర్యుని ద్వారా "కర్ణున్ని" కన్నది. పెళ్ళయ్యాక పాండురాజు కుంతిని కూడలేదు. కుంతి యముడి ద్వారా ధర్మరాజుని, వాయువు ద్వారా భీమున్ని, ఇంద్రుని ద్వారా అర్జున్ని కన్నాది. మాద్రి అశ్వనీ దేవతల ద్వారా నకుల, సహదేవుళ్ళను కన్నది. వీరు పాండవులు. అటు తరువాత పాండురాజు మాద్రిని కూడగా చనిపోయాడు. కర్ణుడు శూద్రునిగా పెరిగాడు.

యముడు శాపవశాన 'విదురుడు'గా పుట్టాడు. కుంతి విదురుడికి వదిన. ధర్మరాజుని ఎవరి ద్వారా కన్నది?

రాముని కన్నా ముందే పుట్టిన పరశురాముడు భీష్ముడికి, కర్ణుడికి ధనుర్విద్య నేర్పుటకు బ్రతికేయున్నాడు.

విష్ణువు అవతారమైన కృష్ణుడు - కంసుడికి (రాక్షసుడు) మేనల్లుడు. యశోద కొడుకుగా "యాదవుడు" (శూద్రుడు).

ఇదంతా బ్రాహ్మణులు సృష్టించిన అబద్ధ గాధ. వర్ణవ్యవస్థ మహాభారత(ద్వాపరయుగములో) కూడా వున్నదని ఋజువు చేయుటే ముఖ్యోద్దేశము. ఆది మానవులు మొదలు ఐరన్ ఏజ్ (ఇనుపయుగం) వరకూ ప్రపంచమంతటా ధనుర్బాణాలు వుపయోగించారు. కానీ భారతదేశములో "బాణాలు"కి మంత్రాలు జోడించి అస్త్రాలుగా మార్చారు. బ్రహ్మాస్త్రము, సమ్మోహనాస్త్రము, ఫాశుపతాస్త్రము, నాగాస్త్రము మొదలైనవి. అన్నీ వేదాలులో ఉన్నాయష.

ఆర్యులలో ఇరు తెగల మధ్య పశువుల కొరకు కురుక్షేత్రములో యుద్ధము జరిగింది. దానికి వారి జానపద గాధలను జోడించి, మహాభారతం వ్రాసారు. వ్యాసుడు కాదు. ఈ యుద్ధము క్రీ॥పూ॥ 600-500 సం॥ మధ్య జరిగింది. ద్వాపర యుగములో కాదు. యజుర్వేదము ఈ యుద్ధము జరిగాక వ్రాయబడింది. ఈ యుద్ధములో కృష్ణుడు అర్జునికి "గీతోపదేశము" చేశాడు అని చెప్తారు. భగవద్గీత క్రీ॥శ॥ 1000 సం॥ ప్రాంతములో వ్రాయబడింది అని పరిశోధకుల అభిప్రాయము.

ద్రౌపది పుట్టుక విచిత్రమైనది. జీవితము ఇంకా విచిత్రమైనది. ఈమె ఐదుగురు పాండవులకు భార్య. ఒక్కోడితో రెండేసి సం॥లు కాపురము చేయాలి. ఐదుగురు భర్తల ద్వారా ఐదుగురు కొడుకులను కన్నది. వీరే ఉప పాండవులు. కర్ణుడు కూడా భర్త అయితే బాగుణ్ణు అనుకుంటుంది. పతివ్రత కదా! కురుక్షేత్ర సంగ్రామమప్పుడు - రాత్రిపూట యుద్ధభూమికి పోయి శవాలను పీక్కుతిన్నది. యుద్ధము ముగిసాక ధృతరాష్ట్రుడు భీముని ఇనప విగ్రహాన్ని కౌగిలించుకొని నుజ్జునుజ్జు చేస్తాడు. ఇనుము క్రీ॥పూ॥ 1200 సం॥లో కనుగొనబడింది. ద్వాపరయుగములో కాదు.

త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణువు, శివులను బ్రాహ్మణులు సృష్టించారు. మరి విష్ణువు రాముడిగా, కృష్ణుడిగా అవతారమెత్తాడన్నది పచ్చి అబద్ధము.

అందుకే రామాయణం, భారతము పూర్తిగా కల్పితము.

శూద్రులారా! ఆలోచించండి. బ్రాహ్మణుల కుట్రకు ఇంకా బలికాకండి. మత మౌఢ్యాన్ని వీడండి. విగ్రహాలను పూజించకండి. దేవుడు ఒక్కడే కదా! అతన్ని మీ హృదయాలలో పూజించండి.

## మనుస్మృతి

"ధర్మో రక్షతి రక్షితః"

ధర్మము రక్షించబడితే - మనము రక్షించబడతాము. ధర్మాన్ని రక్షిస్తే - ధర్మం మనల్ని రక్షిస్తుంది.

అయితే "ధర్మము" అంటే ఏమిటి? మనువు ధర్మశాస్త్రము వ్రాసాడు. ఎవరీ

మనువు? అతడు చెప్పిన ధర్మమేమిటి?

| | |
|---|---|
| మానవుడికి | = 360 రోజులు ఒక సం॥ |
| ఒక మానవ సం॥ | = 1 దేవ రోజు |
| 360 దేవ రోజులు | = 1 దేవ సం॥ |
| 4800 దేవ సం॥లు | = 1 కృతయుగము / సత్యయుగం |
| 3600 దేవ సం॥లు | = 1 త్రేతయుగము |
| 2400 దేవ సం॥లు | = 1 ద్వాపరయుగం |
| 1200 దేవ సం॥లు | = 1 కలియుగం |
| 12000 దేవ సం॥లు | = 1 మహాయుగము (నాలుగు యుగాలు కలిపి) |
| 1000 మహాయుగాలు | = బ్రహ్మకి 12 గం॥ = 1 కల్పం |
| 2 కల్పములు | = బ్రహ్మకి 1 రోజు |
| 360 బ్రహ్మ రోజులు | = 1 బ్రహ్మ సం॥ |

బ్రహ్మ 100 బ్రహ్మ సం॥లు జీవిస్తాడు. ఆ తర్వాత కొత్త బ్రహ్మ, కొత్త సృష్టి, కొత్త యుగాలు మున్నగునవి.

బ్రహ్మకి 12 గం॥ ఒక కల్పము కదా! ఒక కల్పమునకు 14 గురు మనువులుంటారు. ఒక మనువు జీవించే కాలము 71 మహాయుగాలు. దీన్ని ఒక మన్వంతరము అంటారు. ఒక మనువు చనిపోయాక కొత్త మనువు వస్తాడు. మనువు, మానవులకు ఆద్యుడు. (అంటే మానవులను పుట్టించే వాడు).

ప్రస్తుతము "పద్మ"కల్పము సాగుతున్నది. ప్రస్తుత మనువు "పేరు" వైవాస్వతుడు". ఈతని మన్వంతరములో 28 మహాయుగాలు గడచిపోయాయి. ప్రస్తుత మహాయుగములో ఆఖరు యుగము కలియుగము. ఈ కలియుగములో 5107 మానవ సం॥లు గడచిపోయాయి. ఇవన్నీ బ్రాహ్మణుల లెక్కలు సుమా!

ఈ వైవాస్వతుడు – మనుస్మృతి (ధర్మశాస్త్రము) వ్రాసాడు. మనువు "భృగువు"కి చెప్తే, అతడు మిగతా మునులకు చెప్పాడు. ఇదంతా బ్రాహ్మణుల కల్పన సుమా! మనుస్మృతి కూడా అంతే!.

మను ధర్మము ఏమిటి ? "బ్రాహ్మణులకు" ప్రతీవిధమైన మేలు జరగాలి. "శూద్రులు" బానిసలుగా, ఎటువంటి మేలు ఆశించకుండా, గొణుగుకోకుండా "అగ్రవర్ణాలు" వారికి సేవ చేయాలి. స్త్రీలు పురుషులకు ఆస్తి మాత్రమే! వారికి స్వంత ఇష్టాయిష్టాలు, స్వతంత్రము వుండవు.

ఈ సరికి "ధర్మ"మంటే మీకు అర్థమయ్యే వుంటుంది. పూర్తిగా అర్థమవ్వాలంటే మరి కొంత విషయము తెలుసుకోవాలి.

**బ్రాహ్మణుల హక్కులు :-** భూమిపై పుట్టిన దేవత (భూసురుడు). అందరి కంటే అధికుడు. అందరి ఆస్తి మీద హక్కుదారుడు. ఏ పని చేయనవసరము లేదు. క్షత్రియ స్త్రీలకు పిల్లలు పుట్టకపోతే – బ్రాహ్మణుడే ఆ స్త్రీలను కూడి పిల్లలను పుట్టించాలి. బ్రాహ్మణుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర స్త్రీలను కూడవచ్చు. ఏలాంటి తప్పు చేసినా శిక్ష వుండదు. లేక తేలికైన శిక్షతో సరి. మరణము పొందేటంతటి నేరము చేస్తే గుండు కొట్టిస్తే చాలు. యజ్ఞ, యాగాది కర్మలు వీరే చేయాలి. అన్ని దానాలు వీరే స్వీకరించాలి.

శూద్రుడు నుండి దానము స్వీకరించకూడదు. గుంజుకోవాలి. ముష్టి ఎత్తుకున్నా గౌరవముగా చూడాలి. వేదాలు వీరికే స్వంతము. సమాజములో ఉన్నత స్థానము వీరిదే. ఉపనయనము (జందెము వేసుకోవడం) 5 సం॥ల నుండి 16 సం॥ల లోపు జరపాలి. 10 సం॥ల బ్రాహ్మణ బాలుడు 100 సం॥ల వయస్సుగల క్షత్రియుడికి తండ్రితో సమానుడు. "శర్మ, శాస్త్రి వంటి మంచి పేర్లు వీరే పెట్టుకోవాలి".

ఈలాంటి హక్కులు చాలా ఉన్నాయి.

**క్షత్రియుల హక్కు :-** రాజుగా వుండొచ్చు. సేనాధిపతిగా వుండొచ్చు. 16 సం॥ల – 22 సం॥ల మధ్య ఉపనయనము చేసుకోవాలి. బ్రాహ్మణుడి సలహా ప్రకారం పరిపాలించాలి. దానము ఇవ్వాలి, తీసుకోకూడదు. "వీరత్వానికి, యుద్ధానికి సంబంధించిన పేర్లు పెట్టుకోవాలి". బ్రాహ్మణ స్త్రీని కూడకూడదు. వైశ్య, శూద్ర స్త్రీని కూడవచ్చు. రాణికి సంతానము కలుగకపోతే వేరే ఆమెను పెళ్ళి చేసుకోవచ్చు.

ఎంతమందినైనా రాణులుగా చేయవచ్చు. సమస్త భోగభాగ్యాలు అనుభవించవచ్చు. రాజ్యాధికారము వీరి స్వంతము.

**వైశ్యుల హక్కు** :- వ్యాపార లావాదేవీలు, పశువులు వీరికి స్వంతము. 18 సం॥ల నుండి 24 సం॥ల లోపు ఉపనయనము చేసుకోవచ్చు. బ్రాహ్మణ, క్షత్రియ స్త్రీలను కూడకూడదు. శూద్రస్త్రీని కూడవచ్చు. దానమీయవచ్చు. తీసుకోకూడదు. "వ్యాపార, సంపద పరమైన పేర్లు పెట్టుకోవచ్చు".

పైన పేర్కొన్న మూడు అగ్రవర్ణాలకు "ఉపనయనము" జరుగుతుంది. కాబట్టి వీరు ద్విజులు. రెండుసార్లు పుట్టినట్టు. కాబట్టి వీరికి పునర్జన్మ లేదు.

**శూద్రులు** :- ఎటువంటి హక్కులు లేనివారు. బానిసలు. అగ్రవర్ణాలకు సేవ చేయాలి. వారి మాటలకు ఎదురు తిరుగకూడదు. అగ్రవర్ణాల స్త్రీలను కూడకూడదు. చదువుకోరాదు. స్వంత ఆలోచనలు కూడా వుండకూడదు. "అసహ్యకరమైన పేర్లు పెట్టుకోవాలి". ఉపనయనము చేసుకోకూడదు. అందుకే "పునర్జన్మ" వీరి కోసమే. శూద్ర స్త్రీలు బ్రాహ్మణుల ముందు – ఛాతీని కప్పుకోకుండా వుండాలి. శూద్రుడు బ్రాహ్మణునికి 20 అడుగుల దూరాన నిలబడాలి. ఇంకా ఈలాంటివి ఎన్నెన్నో!.

శూద్రుడు పైవాటిలో దేనినైనా ఉల్లంఘిస్తే శిక్షలు చాలా కఠినముగా వుండాలి.

శూద్రుడు బ్రాహ్మణ్ణి తిడితే – నాలుక కోయాలి, చంపేయాలి.

మంచి మాటలు చెప్తే – నోటిలో మరిగే నూనె పోయాలి.

శూద్రుడు ద్విజులను ఏ అంగముతో కొడితే ఆ అంగాన్ని నరికేయాలి (కాలు, చేతులు).

వేదాన్ని వింటే చెవిలో సీసము పోయాలి.

వేదాన్ని వచిస్తే నాలుక కోయాలి.

వేదాన్ని పఠిస్తే చంపేయాలి.

బ్రాహ్మణునితో సమానముగా కూర్చుంటే – నడుముపై వాతపెట్టి పిర్రలు కోసేయాలి.

ఉచ్చపోస్తే పురుషాంగాన్ని కోసేయాలి.

బ్రాహ్మణుని వద్ద పిత్తితే – కత్తితో ముడ్డిని నరకాలి.

శూద్రునికి ఆస్తిపాస్తులుంటే దాన్ని బ్రాహ్మణుడు గుంజుకోవచ్చు.

ఇదీ ధర్మం. "ధర్మో రక్షతి రక్షిత ః" హిందూ ధర్మము. దీన్నే జగద్గురువులు, పీఠాధిపతులు పదే పదే భోధిస్తారు.

**స్త్రీల గురించి :-** మను ధర్మశాస్త్రము స్త్రీల గురించి ఏమి చెబుతుంది. ఆడదానికి స్వతంత్రముండకూడదు. ఆస్తి పాస్తులుండకూడదు. ఆడదే పురుషుని ఆస్తి. స్త్రీ స్వతహాగా వ్యభిచార గుణము కలదని మనువు అంటాడు. బహిష్ఠు అయిన స్త్రీని ముట్టుకోకూడదట. సంభోగించకూడదట. కూడితే పాపము. భర్త మాట జవదాటరాదు, భర్తతో కలసి భోజనము చేయరాదు.

ఆడది రజస్వల కాకముందే పెళ్ళి చేసుకోవాలి. మొగుడు చస్తే ముండమోయాలి. మరల పెళ్ళి చేసుకోకూడదు. గుండు కొట్టించుకొని కురూపిగా కనపడాలి. శుభకార్యాలకు వెళ్ళకూడదు. ఒక్కపూటే తినాలి. అందరూ తిన్నాక మిగిలింది తినాలి. ఇంటి చాకిరీ అంతా చేయాలి. ప్రయాణము చేసేవారి కంటపడకూడదు. అశుభం!. మొగుడు చస్తే సహగమనము చేయాలి. అన్న చనిపోతే, వదినను మరిది అనుభవించవచ్చు. రవిక వేసుకోకూడదు. తాంబూలము వేసుకోకూడదు. ఈలాంటి ధర్మాలు ఎన్నో. మనుస్మృతితో పాటు వేరే స్మృతి కర్తలు ఇంకా కఠినమైన షరతులు, విధి విధానాలు రూపొందించారు.

**కులాలు ఏలాగు పుట్టాయి** ? కొన్ని ఉదాహరణలు. మనువు నిర్ధారించాడు.
విలోమ పద్ధతిలో :

బ్రాహ్మణుడు క్షత్రియ స్త్రీలను కూడగా – పుట్టినవారు నియోగి బ్రాహ్మణులు, గుర్రాలను, ఏనుగులను సాకేవారు, రధాన్ని తోలడము వృత్తిగా గలవారు.

బ్రాహ్మణుడికి వైశ్య స్త్రీ వలన పుట్టినవారు – వైద్యము చేస్తారు.

బ్రాహ్మణుడికి శూద్ర స్త్రీ వలన పుట్టినవారు – మంగలి, చేపలు పట్టేవారు.

క్షత్రియుడుకి వైశ్య స్త్రీ వలన పుట్టినవారు – నృత్యగీతాలు చేసేవారు, జ్యోతిష్యము చెప్పేవారు.

క్షత్రియునకు శూద్ర స్త్రీ వలన పుట్టినవారు – ఉడుములు పట్టేవారు.
వైశ్యునకు శూద్ర స్త్రీ వలన పుట్టినవారు – ద్విజులకు, రాజులకు, శుశ్రూష చేసేవారు.

**అవిలోమ పద్ధతిలో :**

శూద్రునకు – బ్రాహ్మణ స్త్రీ వలన – చండాలురు (పంచమ వర్ణము) ఎస్.సీలు
– క్షత్రియ స్త్రీ వలన – ఉడుములు పట్టేవారు
– వైశ్య స్త్రీ వలన – వడ్రంగివారు పుడ్తారు.
వైశ్యునకు – బ్రాహ్మణ స్త్రీ వలన – అంతఃపుర సేవకులు పుడ్తారు.
– క్షత్రియ స్త్రీ వలన – వర్తకం చేసేవారు మాగధులు పుడ్తారు.
క్షత్రియునకు – బ్రాహ్మణ స్త్రీ వలన – సూతుడు పుడ్తాడు.

ఇవన్నీ భారతదేశములో పుట్టిన వారికే సుమా! విదేశీయులందరూ – మ్లేచ్ఛులు, అప్రాచ్యులు.
పైన పేర్కొన్న ధర్మాలన్నీ – బ్రాహ్మణులు వ్రాసి మనువు అనే వాడికి (ఉన్నాడో, లేడో) అంటగట్టారు.

ఈలాంటి ధర్మాన్ని రక్షించడానికి, లేక పునఃస్థాపించుటకు – ఒక్కో యుగములో విష్ణువు ఒక్కో అవతారము ఎత్తుతాడు.
శూద్రులారా! ఆలోచించండి. ఇప్పటి శూద్రులు కొందరు – అగ్రజాతులుగా భావించుకొని, బ్రాహ్మణులకు అడుగులకు మడుగులొత్తుచున్నారు. మేమే రాజులము అనుకొని యజ్ఞయాగాది క్రతువులను బ్రాహ్మణులచే జరిపించుచున్నారు.

అగ్రవర్ణాలు మూడు తప్ప, మిగిలిన వారందరూ శూద్రులే. దక్షిణ భారతదేశములో బ్రాహ్మణులు మాత్రమే ఆర్యులు. మిగతావారంతా శూద్రులే సుమా!.

# అధ్యాయము-8

## హిందువులు - దేవుళ్ళు

ఆర్యులు ప్రకృతి శక్తులను పూజించేవారు. ఋగ్వేదము - అగ్ని దేవుని స్తుతితో ప్రారంభమవుతుంది. అగ్ని, ఇంద్రుడు, వరుణుడు, సూర్యుడు, సోముడు ముఖ్య దేవతలు. దేవున్ని "దేవ" లేక "దేవుస్" అని సంభోదించేవారు. ఆకాశమును "ద్యౌస్‌పితర్" లేక "జూపిటర్" లేక "జెయూస్‌సాతెర్" అనే పేర్లతో తండ్రిగా భావించారు. భూమిని తల్లిగా భావించారు. ఆకాశావరణమును "వరుణ" **లేక** "ఔరనాస్" అని పిలిచేవారు.

మరియు పితరులు మరణిస్తే, వారిని దహనము చేయునప్పుడు, అగ్నికీలలు వారిని దేవతలు వద్దకు కొంచుపోవునని, వారు అమరత్వము పొంది దేవతలతో సమానంగా శక్తిమంతులౌతారని నమ్మేవారు. ఆ విధముగా మొట్టమొదటి మానవుడు చనిపోయి "యముడు" అయ్యాడు.

ఋగ్వేదములో 33 దేవతల ప్రస్తావన వుంది.

**(1) జ్యోతిర్మయమండల దేవతలు :-** వరుణ, సూర్య, సవితృ, విష్ణు, ఉష, అతిధి, ఆర్యమన్, మిత్ర అశ్విని మొ॥వారు

**(2) వాయుమండల దేవతలు :-** వాత, వాయు, ఇంద్ర, రుద్ర, పర్జన్య, మరుత్తు మొ॥వారు.

**(3) భూమండల దేవతలు :-** అగ్ని, సోమ, యమ మొ॥వారు.

రాను, రాను వీరి సంఖ్య 3339కి పెరిగింది. వీరిలో జీవమున్నవి, నిర్జీవమైనవి చెట్లు, పుట్టలు వున్నాయి. కాలము గడుస్తున్న కొద్ది ఆడ, మగ దేవతలు 3 కోట్లు అయ్యారు. తరువాత 33 కోట్లు అయ్యారు. వీరిలో చనిపోయిన మనుష్యులు - ఆడ, మగ వున్నారు. బ్రతికున్నవారున్నారు. అఖరుకి వీరందరిలో "త్రిమూర్తులు" ముఖ్యులయ్యారు.

ఆర్యులు భారదేశములో ప్రవేశించి, బెంగాలులోనున్న సుందర్ బన్స్ (అడవులు) చేరుకొనేసరికి ఋగ్వేదాన్ని నాలుగు వేదాలుగా మార్చేశారు. మగ దేవుళ్ళకు తోడుగా ఆడ దేవుళ్ళను ప్రవేశపెట్టారు. ఆర్యులు యుద్ధప్రియులు. కాబట్టి ప్రతీ దేవునికి, దేవతకు ఆయుధాలు నిర్ధారించారు. ఆర్యులు గుర్రాలను వాహనాలుగా ఉపయోగించారు. కాబట్టి ప్రతి దేవునికి పక్షినో, జంతువునో వాహనంగా నిర్ధారించారు. అలాగే వీరికి ఏయే శక్తులుండాలో నిర్ణయించారు. వారు ఏలాగు జన్మించారో, ఎవరికి జన్మించారో, ఎక్కడ జన్మించారో కూడా నిర్ధారించారు. దేవుళ్ళు పంచెలు కట్టుకున్నట్టు, దేవతలు చీరలు కట్టుకొని, నగలు ధరించినట్లు రాజా రవి వర్మ ఊహించి చిత్రాలు వేశాడు. అవే ఇప్పుడు మన కేలండర్లలో కనపడుతున్నాయి.

క్రీస్తు పూర్వము 500 సం॥ల నుండి, బౌద్ధమతము వ్యాప్తి చెందుతూ ప్రజల, పాలకుల అభిమానము చూరగొన్నది. కుల విషయములో శూద్రులకు బౌద్ధమతము మహా ఊరట నిచ్చింది. ఈ మార్పు బ్రాహ్మణులకు శరాఘాతమైంది. వారి జీవనోపాధి దెబ్బతింది. బ్రాహ్మణుల బ్రతుకు శూద్రుల కష్టము పై ఆధారపడివుంది. పచ్చిగా చెప్పాలంటే బ్రాహ్మణులు సమాజముపై బదనికలు. వారి జీవనోపాధి దెబ్బతినకుండా వుండాలంటే శూద్రులు వారి చెప్పు చేతలలో వుండాలి.

వేదకాలము ఆర్యులు భారతదేశములో ప్రవేశించిన క్రీ॥పూ॥ 1500 సం॥ నుండి 500 సం॥ వరకూ వేయి సంవత్సరములు సాగింది. తర్వాత బ్రాహ్మణ యుగము ఆరంభమై నేటి వరకూ కొనసాగుతూనే వుంది.

బౌద్ధమతము అరికట్టుటకు బ్రాహ్మణులు నడుము బిగించారు. ఏలాగంటే

(1) సంస్కృతములో నున్న వేదాలు సామాన్యులకు అర్థము కావు. జనాభాలోనున్న 95% శూద్రులు చదువుకోకూడదు. జనాభాలో 50 శాతమున్న స్త్రీలకు చదువులేదు. వేదాలు గురుముఖంగా నేర్చుకోవాలి. ఈ వెసులుబాటును బ్రాహ్మణులు అలుసుగా తీసుకొని వేదముల అర్థాలే మార్చేశారు. వారు భారతదేశములో ప్రవేశించినప్పుడు వున్న దేవతల ప్రాముఖ్యతను తగ్గించివేసి క్రొత్తగా

త్రిమూర్తులు - **బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను** కల్పిత దేవుళ్ళను ప్రవేశపెట్టారు. వారు పుట్టు పూర్వోత్తరాలను కూడా తమకల్పిత భాగవత, పురాణాలలో, పరస్పర విరుద్ధముగా చొప్పించారు.

(2) కులమును (వర్ణాలను) తమ రచనల ద్వారా బలముగా నిర్ధారించారు. చదువులేని శూద్రుల తలలో బలముగా చొప్పించారు.

(3) అగ్రవర్ణాలు (బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు). జందెము వేసుకుంటారు. కాబట్టి వారు ద్విజులు, అంటే యోని ద్వారా మొదటి జననము, ఉపనయనము ద్వారా రెండో జననము. అంటే రెండు జన్మలెత్తారు. కాబట్టి వీరికి వేరే జన్మలుండవు. వారేమి చేసినా వచ్చే జన్మలో తక్కువగా పుట్టరు.

శూద్రులు ద్విజులు కారు. వారికి వుపనయనములేదు. కాబట్టి వారు ఎన్నో జన్మలు ఎత్తాలి. పాపపుణ్యాలు బట్టి మానవులుగా, జంతువులుగా, పక్షులుగా పుడతారు. చదువులేని శూద్రుల మనస్సులో పాతుకుపోయేటట్లు ఈ విషయము బ్రాహ్మణులు బహు నేర్పుగా, చక్కగా చొప్పించారు.

(4) పూర్వజన్మలో చేసిన పాపాలకు ఈ జన్మలో శిక్ష అనుభవించుటకు శూద్రులుగా, పంచములుగా పుట్టారు. కాబట్టి "కర్మ" నుంచి తప్పించుకోలేరు. ఇది కర్మసిద్ధాంతము. ఈ కర్మ సిద్ధాంతాన్ని కూడా చదువులేని శూద్రులు తలలో బలముగా చొప్పించారు.

ఈ విధముగా శూద్రులను భయపెట్టి వారి పబ్బము గడుపుకొనుటకు బ్రాహ్మణులు కుట్రచేశారు. శూద్రులను అదుపు చేయటానికి స్మృతులను రచించి - అవి దేవుడే చెప్పాడని నమ్మించాగు. శూద్రులను మానసికంగా బలహీనపరచి, వారి కష్టాన్ని దోచుకోసాగారు. నేటి ఈ దోపిడీ సాగుతూనే వున్నది.

దేవుళ్ళకు మానవ స్వభావము కల్పించి వారిని మానవ స్థాయికి దిగజార్చారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు వారికే ఎక్కువగా కల్పించారు. ఋషులు, పాతివ్రత్యము కలిగిన స్త్రీలు దేవుళ్ళను శపించే శక్తిగలవారుగా చిత్రించారు. లైంగిక బలహీనతలు బ్రాహ్మణులు సృష్టించిన దేవుళ్ళలో ఎక్కువగా

కనబడ్డాయి.

**వస్త్రధారణ :-** రాజారవివర్మ వేసిన బొమ్మలలో మగవారు పంచెకట్టుకుంటారు. ఆడవారు చీర, రవిక కట్టుకుంటారు. నగలు ధరిస్తారు.

**స్వభావము :-** పూర్తిగా మానవ స్వభావము. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు గలవారు. లైంగికాసక్తి మానవులు కంటె ఎక్కువ.

**కుటుంబాలు :-** ఇంచుమించు అందరి దేవుళ్ళకి కుటుంబాలున్నాయి, పిల్లలున్నారు.

**శరీరాకారాలు :-** వీరు మనుష్యుల, జంతువుల, పక్షుల ఆకారాలలో వుంటారు. మనుష్య ఆకారాలలో వున్నవారికి ఒక తల లేక ఎక్కువ తలలు, రెండు లేక ఎక్కువ చేతులు గలవారున్నారు. కొందరు సగము మనిషి, సగం జంతువుగా వుంటారు.

**భాష :-** వీరు సంస్కృత భాషను మాట్లాడుతారు.

**జీవితము :-** వీరికి పుట్టుకలు, మరణాలున్నాయి. దేవతల, దేవుళ్ళ జనన విధానాలు అనేక విధాలు. యోని నుండి మాత్రమే పుట్టరు. అనేక శరీరభాగాల నుండి స్త్రీ గర్భము బయట పుట్టారు. మోహిని (విష్ణువు)కి, శివుడికి అయ్యప్ప పుట్టాడు. ముళ్ళపొద మీద పడిన శివుని వీర్యం కుమార స్వామిగా పుట్టాడు. నలుగుతో గణపతి సృష్టించబడినాడు.

**దైనందిన జీవితము :-** నలుగు పెట్టుకుంటారు, జలకాలాడుతారు, స్నానము చేస్తారు. పసుపు రాసుకుంటారు. బొట్లు పెట్టుకుంటారు. అంతా మానవులలాగే.

**వాహనాలు :-** దేవుళ్ళందరికి వాహనాలున్నాయి. జంతువులు, పక్షులు, సముద్రజీవులు మొదలైనవి.

**ఆయుధాలు :-** ప్రతి దేవుడికి ఒకటి లేక కొన్ని ఆయుధాలున్నాయి.

**లైంగికత :-** ఆడ, మగ దేవుళ్ళకు తప్పని సరి. కొంతమంది "కామాతురత" గలవారు. మానభంగం కూడా చేస్తారు.

**యుద్ధాలు :-** మాట పట్టింపులతో దేవుళ్ళ, దేవతల మధ్య యుద్ధాలు

జరుగుతాయి. గెలుపు, ఓటములు వుంటాయి.

**శాపాలు :-** వీరంతా ఒకర్నొకరు శపించుకోగలరు. మనుష్యులను శపించగలరు. మనుష్యులు, ఋషులు, పతివ్రతలు కూడా దేవతలను, దేవుళ్ళను శపించగలరు.

**ఆర్థికలావాదేవీలు :-** కుబేరుడు అప్పులిస్తాడు. వడ్డీతో వసూలు చేస్తాడు. శుక్రుడు, వెంకటేశ్వరుడు కుబేరుడి నుండి అప్పు తీసుకున్నారు.

**విగ్రహాలు :-** వేదకాలములో లేని విగ్రహారాధన, బ్రాహ్మణులచే బ్రాహ్మణయుగములో ప్రవేశపెట్టబడింది.

దేవుళ్ళను వికృత రూపాలలో రూపొందించి, వాటిని ఆరాధించసాగారు. ఈ దేవుళ్ళకు క్రీస్తు శకారంభములో మందిరాలు నిర్మించనారభించారు.

ఆర్యులు రాకముందే, భారతదేశములో గంగానది వున్నది. గంగానదిని శివుడికి రెండో భార్యను చేశారు. ఇది పుణ్యనది. దిగి స్నానము చేస్తే పాపాలన్నీ పోతాయి. గంగానది ఒడ్డున నివసించే వారికి పాపాలంటవు.

నాగుపాములు కూడా దేవతలే. ప్రపంచమంతా వున్నాయి. మన దేశములో దేవతలు. వాటిని చూస్తే భయమేసి చంపుతారు.. నాగుల చవితి నాడు పుట్టలో పాలుపోస్తే, మట్టిలో ఇంకిపోతాయి. గ్రుడ్లు పెడితే పక్షులో, జంతువులు తింటాయి. దేవుళ్ళు పడుకోవడానికి పవ్వళింపు సేవ చేయాలి, వారిని లేపుటకు మేల్కొపు పాటలు పాడాలి.

హిందూదేశములో దేవుళ్ళందరూ హిమాలయ, వింధ్య పర్వతాల మధ్యనే పుట్టారు. అవతరించారు. మానవులను, బ్రహ్మతో పాటు ఇంకా అనేకులు పుట్టించారు.

దేవుళ్ళను, దేవతలను బ్రాహ్మణులు సృష్టించారు. త్రిమూర్తుల గురించి తెలుసుకుందాము.

## త్రిమూర్తులు

త్రిమూర్తులను బ్రాహ్మణులు పుట్టించారు. ఈ కల్పిత దేవుళ్ళను చదువురాని

వారి బుర్రలలో ఇంజెక్ట్ చేసి ఎక్కించారు.

**త్రిమూర్తుల పుట్టుక :-** (వారి భార్యలు కూడా)

(ఎ) ఆది పరాశక్తి మూడు గ్రుడ్లను పెట్టింది. ఆ మూడు గ్రుడ్ల నుండి బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు పుట్టారు.

(బి) బ్రహ్మము (సుప్రీమ్ గాడ్), ఆదిపరాశక్తి మూడు బుడగలను పుట్టించారు. ఒక బుడగ నుండి విష్ణువు, పార్వతి, రెండో బుడగ నుండి శివుడు, సరస్వతి. మూడో బుడగ నుండి బ్రహ్మ, లక్ష్మి పుట్టారు.

(సి) విష్ణువు ఇంద్రుడికి తమ్ముడు (అందుకే ఉపేంద్రుడు అని పేరు). సూర్యుడికి కుమారుడు.

(డి) విష్ణువు బొడ్డు నుండి పద్మము పుట్టింది. ఆ పద్మము నుండి బ్రహ్మ పుట్టాడు.

(ఇ) బ్రహ్మ ఫాలభాగము (నుదురు) నుండి శివుడు పుట్టాడు.

(ఎఫ్) ఆది పరాశక్తి తనను పెళ్ళాడమని బ్రహ్మను కోరింది. నీవు తల్లివి. నేను నిన్ను పెళ్ళాడలేను అన్నాడు. విష్ణువుని అడుగుతే అతడు కూడా ఆలాగే అని తప్పుకున్నాడు. శివున్ని అడిగింది. నీ మూడో కన్ను నాకిస్తే నిన్ను పెళ్లాడుతాను అని చెప్పాడు. ఆలాగే అని శివునికి మూడో కన్ను ఇచ్చింది. ఆ మూడో కన్ను ధరించి శివుడు ఆదిపరాశక్తిని భస్మము చేశాడు. ఆ బూడిదను మూడు కుప్పలుగా పోసి వారి నుండి పార్వతి, లక్ష్మి, సరస్వతులను పుట్టించాడు, పార్వతిని పెళ్ళాడాడు.

(జి) పాల సముద్రము మదించగా అనేకమైన అపురూపమైన వస్తువులతో పాటు "లక్ష్మి" కూడా పుట్టింది.

(హెచ్) బ్రహ్మ తొడ నుండి సరస్వతి పుట్టింది. సరస్వతి అందానికి "రిమ్మతెగులు" పుట్టి కూతురునే పెళ్ళాముగా చేసుకున్నాడు. బ్రహ్మ కొడుకులు బ్రహ్మని తిట్టారు.

(ఐ) పార్వతి రెండు మూడు సార్లు చనిపోయి దక్షుని కూతురుగా, పర్వతానికి

కూతురుగా పుట్టింది.

(జె) త్రిమూర్తులు, వారి భార్యలు పుట్టుకలను గూర్చి బ్రాహ్మణులు చాలా రకాలుగా పురాణాలలో వ్రాశారు.

**అసలు సంగతి :-** వేదకాలములో త్రిమూర్తులు ముఖ్యమైన దేవుళ్ళు కారు. ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, మిత్ర, సోముడు ముఖ్యమైన దేవుళ్ళు. బ్రాహ్మణ యుగము (క్రీ॥పూ॥ 300-400 సం॥ల కాలము)లో బ్రాహ్మణులు. ఈ త్రిమూర్తులను పుట్టించారు.

**బ్రహ్మ :-** వేదాలులో "బ్రహ్మము" (శక్తివంతుడైన దేవుడు) వున్నాడు. బ్రహ్మ లేదు. వేదాలు ముఖతః నేర్చుకోవాలి. మంత్రాలు వల్లించే పద్ధతులు బట్టి వాటి అర్థాలు మారుతాయి. ఆ విధంగా "బ్రహ్మము" ని బ్రహ్మగా మార్చేశారు. "ప్రజాపత" "సృష్టికర్త" అన్నారు.

**విష్ణువు :-** ఇతడు ఇంద్రునికి తమ్ముడు, సూర్యుని కొడుకు. అందుకే "ఉపేంద్రుడు" అయ్యాడు. వేదాలులో ముఖ్య దేవుడు కాడు. ఈతనికి అనేక శక్తులున్నట్లు, యుగానికో అవతారము ఎత్తినట్లు అనేక కల్పితాలు పురాణాలలో, భాగవతములో వ్రాశారు.

**శివుడు :-** వేదాలులో "రుద్రుడు" గా పేర్కొనబడిన దేవుడు. అగ్నికి సంబంధించినవాడు. ద్రావిడులు దక్షిణ భారత దేశానికి పోయి స్థిరపడ్డాడు. వీరి దేవుడు "లింగము" (పురుషాంగము). ఈ లింగారాధన ఆర్యులకు నచ్చలేదు. లింగానికి బలులు ఇవ్వడము అసహ్యకరముగా భావించారు. భారత దేశములో బౌద్ధమతము వ్యాపించి ద్రావిడులు కూడా దాన్ని అవలంభించారు. ఈ మత వ్యాప్తిని నిరోధించి, నిర్మూలించుటకు బ్రాహ్మణులు "మిషనరీలు" వలె దక్షిణ భారత దేశానికి వెళ్ళి, అచ్చటి రాజులను మెప్పించి, వారిని, ప్రజలను హిందూ మతములోనికి వచ్చేటట్లు "లింగానికి" ప్రాధాన్యత ఇచ్చారు. రుద్రున్ని, లింగాన్ని కలిపి "శివుడు" గా మలచారు. ద్రావిడుల "నన్నా" దేవుని వాహనము ఎద్దు. దాన్నే నందిగా మార్చి శివుని వాహనము చేశారు.

ఈ ముగ్గురు త్రిమూర్తులు ఒకరితో ఒకరు యుద్ధము చేసుకున్నారు. ఈ ముగ్గురిలో "విష్ణువు" శక్తివంతుడు, యుక్తిపరుడు.

శివుడు బ్రహ్మ ఐదోతలను నరికి వేశాడు. బ్రహ్మకు పూజ జరగకుండా అతనికి మందిరాలు వుండకూడదని శపించాడు. (భృగువు కూడా ఈలాగునే బ్రహ్మను శపించాడు).

శివ జ్వరాన్ని, విష్ణు జ్వరము ఓడించగా, శివుడు విష్ణువు శరణుజొచ్చాడు.

**త్రిమూర్తుల గురించి విచిత్రమైన సంగతులు :-**

బ్రహ్మకి "యోని" లేదు. పుట్టినవారంతా బ్రహ్మ శరీర భాగాలు నుండి పుట్టారు. (భారతదేశములోనే సుమా!) ఒకసారి తన తొడనుండి ఒక రాక్షసున్ని పుట్టించాడు. ఆ రాక్షసుడు బ్రహ్మనే రమించి వెంటాడగా, విష్ణువు ఆ రాక్షసున్ని చంపి బ్రహ్మను రక్షించాడు. (స్వలింగ సంపర్కము ఇక్కడే పుట్టింది).

శివుడు భస్మాసురునికి వరము ఇచ్చాడు. వాడు ఎవరి తలపై చేయి పెడ్తే వాడు భస్మము అయిపోతాడు. వరము పొందిన భస్మాసురుడు శివుని తలపైనే చేయిపెట్టబోయాడు. శివుడు విష్ణువు శరణుజొచ్చాడు. విష్ణువు 'మోహిని' రూపమెత్తి భస్మాసురున్ని ఆకర్షించి, వాణ్ణి స్నానము చేసి రమ్మన్నాడు. భస్మాసురుడు స్నానము చేస్తూ తన తలపై చేయిపెట్టుకోగా భస్మము అయిపోయాడు. అంటే దేవుళ్ళు కూడా భస్మము అయిపోతారా? చచ్చిపోతారా? శివుడు శనిబాధ నుండి తప్పుకొనుటకు చెట్టు తొర్రలో దాగున్నాడు.

**శివలింగము కథ :-**

(1) భృగు మహర్షి కైలాసానికి వెళ్ళి శివున్ని చూడబోయాడు. "నంది" అడ్డుకున్నాడు. లోపల శివపార్వతులు రతిక్రీడ సలుపుతున్నారు. కాబట్టి లోపలికి పోకూడదు. భృగువు పదమూడు సం॥లు వేచి చూశాడు. కోపమొచ్చి శివపార్వతుల జనాంగాలు తెగి పడాలని శపించాడు. అవి తెగిపడి "లింగము" **"పానపట్టము"** గా భూమిపై వెలసాయి.

(2) శివుడు, మోహని రూపములోనున్న విష్ణువు ఆకాశములో సంభోగము

చేస్తుంటే, క్రింద మునుల "యజ్ఞాని" కి అవరోధమేర్పడింది. మునులకు కోపమొచ్చి వారి జననాంగాలు తెగిపడాలని శపించారు. "లింగము" "పానపట్టము"గా అవి భూమిపై పడ్డాయి.

అయితే పానపట్టము పార్వతిదా? లేక మోహినిదా?

**శివపార్వతులు – వారి సంతానము :–** దేవతలు నలుగుపెట్టుకొని స్నానము చేస్తారు. వారికి శరీరాలు ఉంటాయేమో? చెమటపడతాదేమో? ధూళి అంటుకుంటుందేమో?

పార్వతి నలుగుపెట్టుకొని, శరీరమునుండి రుద్ది తీసిన నలుగుతో ఒక బాలుణ్ణి పుట్టించి, ద్వారము దగ్గర కాపలా వుంచి స్నానానికి వెళ్ళింది. శివుడు వచ్చి లోపలికి పోబోగా ఆ బాలుడు అడ్డుకున్నాడు. శివుడికి కోపమొచ్చి బాలుడు తలను నరికివేశాడు. పార్వతి లబలబలాడింది. ఏనుగును చంపి దాని తలను తెచ్చి బాలుడి శరీరానికి అతికించాడు. అతడే గణేశుడు. అసలు బాలుడి తల ఏమైందో? ఎక్కడ పడిందో? వెతకడానికి శివుడుకి శక్తి లేదా? మహిమ లేదా?. గణేశుడు పుట్టుక గురించి వేరే పురాణ కథలు వున్నాయి. విష్ణువు వరముతో శివపార్వతులకు కొడుకుపుట్టాడు. శని దృష్టిపడగా కొడుకు తల తెగిపోయింది. శివుడు ఏనుగు తల అతికించాడు.

గణేశుని ఏనుగు తల – గజాసురుడిది. గణేశుని తల – ఇంద్రుని ఐరావతానిది. పార్వతి బహిష్టు అయింది. ఆ రక్తము గంగానదిలో పారబోసారు. ఈ రక్తము కలిసిన గంగానది జలాన్ని మాలిని అనే ఏనుగు త్రాగింది. ఆ ఏనుగు ఐదు ఏనుగు తలలు గల బాలున్ని కన్నాది. శివుడు నాలుగు తలలు నరికేశాడు. దేవతలు బహిష్టు అవుతారా? ఈ గణేశుడే, వ్యాసుడు చెబుతుండగా "మహాభారతము" రచించాడు. శివుడు ఓసారి పార్వతితో సంగమిస్తూ తన వీర్యాన్ని యోనిలో కాకుండా ముండ్లపొదపై విడిచాడు. ఆ వీర్యము నుండి ఆరు ముఖములుగల కుమార స్వామి పుట్టాడు. ద్రావిడులు సుమేరియా నుండి భారతదేశము వస్తూ వారితో "యిస్తారో" దేవతను తెచ్చారు. ఈమెకు అనేక చేతులు వుంటాయి. ఈమె "కాళిక"

గా రూపొందించబడింది. వీరికి సంబంధించిన పేర్లు ఉత్తరభారత దేశములో వినరావు.

రామలింగము, సన్యాసిలింగము, లింగమూర్తి, ఆర్ముముగము, షణ్ముగము, సుబ్రమణ్యము మొదలగు పేర్లు దక్షిణ భారతదేశములోనే ఎక్కువగా పెట్టుకుంటారు. చెంబు అంటే రాగి, (ఎరుపు) చెంబుని శంభో అంటారు. శివుడు ఎర్రనివాడు. అందుకే శంభోశంకర అంటారు.

**శివుని గూర్చి వేరే కథలు :-** చంద్రుడు తన గురువు బృహస్పతి భార్య "తార"ను వశపర్చుకున్నాడు. విష్ణువుతో సహా దేవతలెవరూ చంద్రుణ్ణి ఏమీ చేయలేకపోయారు. శివుడు చంద్రున్ని క్రిందపడవేసి త్రొక్కాడు. చంద్రుడు కళలుగా విడిపోయాడు. అందులో ఒక కళను (చంద్రవంక) శివుడు తలపై ధరించాడు (బృహస్పతి దేవతలకు గురువు).

రాక్షసుల గురువు శుక్రుడు కుబేరుడి నుండి అప్పు తీసుకొని తీర్చలేదు. కుబేరుడికి శివుడు మంచి స్నేహితుడు. శివుడు, శుక్రుణ్ణి మింగేశాడు. తన నవరంధ్రాలు మూసేసి, శివుడు తన శిశ్నము ద్వారా శుక్రుణ్ణి బయటకు వదిలాడు.

ఒకసారి 'శివుడు' చనిపోగా 'కాళి' శివుని శిశ్నముపై అధిరోహించి 'సృష్టి' సజావుగా సాగుటకు సంకల్పించింది.

ఈలాంటివే చాలా కథలు శివుడు, పార్వతుల గురించి వున్నాయి. దక్షిణ భారతదేశానికే పరిమితమైన గ్రామదేవతలు, కులదేవతలు, ఇష్ట దేవతలు పార్వతి యొక్క అంశలు. అందుకే పార్వతి "అమ్మలను గన్న అమ్మ" అయింది. శివుడు ద్రావిడుల దేవుడు. ద్రావిడులు (శూద్రులు) రాక్షసుల పిల్లలు. కాబట్టి శివుడు రాక్షసులకు వరాలు ఇస్తాడు. ఈ రాక్షసులను విష్ణువు చంపుతాడు. రాక్షసులలో కొందరు విష్ణు భక్తులున్నారు. అయినాసరే వారిని కూడా విష్ణువు శిక్షిస్తాడు. ఎందుకంటే విష్ణువు దేవతల పక్షపాతి. దేవతల రాజు "ఇంద్రుడు". ఇంద్రుడుకి విష్ణువు తమ్ముడు. రాక్షసులు ఇంద్రపదవి కొరకు దేవతలతో యుద్ధాలు చేస్తారు.

**విష్ణువు గురించిన కథలు :-** విష్ణువు చాలా అవతారాలు ఎత్తాడు.

ఈ కలియుగములో ఇంకో అవతారము "కల్కి" అవతారమెత్తాలి.

భూమిపై "ధర్మము" నెలకొల్పడానికి ప్రతీయుగములో విష్ణువు ఒక్కో అవతారమెత్తుతానని భగవద్గీతలో చెప్పాడు. అయితే సత్యయుగములో 5,6 అవతారాలు ఎత్తాడు. సత్య యుగములో ధర్మము నాలుగు పాదాల నడుస్తుంది. మరి ఆ యుగములో విష్ణువు 5,6 సార్లు అవతరించాడు. త్రేతాయుగములో 1,2 అవతారాలు ఎత్తాడు. ద్వాపరయుగములో 2 అవతారాలు ఎత్తాడు. కలియుగములో 2 అవతారాలు ఎత్తాడు (బుద్ధుడు, శ్రీనివాసుడు). మూడో అవతారము "కల్కి" ఇంకా ఎత్తాలి.

ముఖ్య అవతారాలు 10. వేరే అవతారాలు 22 లేక 30 వున్నాయట. వాటిలో మోహిని అవతారము, బౌద్ధ (బుద్ధుడు కాదు) అవతారమును కూడా ముఖ్యమైనవి.

10 అవతారాలు మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ అవతారాలు కృతయుగములో, రామ అవతారము (పరశురాముడు బ్రదికి యుండగానే) త్రేతాయుగములో, బలరామ, కృష్ణ అవతారాలు ద్వాపరయుగములో ఎత్తాడు. బౌద్ధమతము బలంగా వ్యాప్తిచెందుతుండగా, బలరాముణ్ణి తప్పించి, బుద్ధుడిని ఒక అవతారముగా చేశారు.

కలియుగములో బుద్ధుడు, తిరుపతి వెంకటేశ్వరుడుగా రెండు అవతారాలు ఎత్తాడు. ఇంకా "కల్కి" అవతారము ఎత్తాలి. వెంకటేశ్వరునికి "ముస్లిమ్" భార్య కూడా వుంది. (బీబీ నాంచారి)

పరశురాముడు ద్వాపరయుగము వరకు బ్రదికి, భీష్మునికి, కర్ణుడికి, విలు విద్య నేర్పాడు. త్రేతాయుగములో మానవుడి జీవితకాలము 300 సం॥లు. అయినా రాముడు 11000 సం॥లు జీవించాడు. కృష్ణుడు రాక్షసునికి మేనల్లుడు. దేవకి కొడుకు. యాదవరాలైన యశోదకి పెంపుడు కొడుకు. కురువంశానికి చెందని "పాండవులు" పక్షాన నిలిచి భారతయుద్ధము నడిపాడు. ఈతనికి 16008 మంది భార్యలు. 144000 వేలమంది సంతానము. అయినా "అస్కలితుడు" బ్రహ్మచారి. మానవ మాత్రుడుగా వుండి కూడా "చక్రాన్ని" ధరించాడు. గురుత్మంతుని మీద

సత్యభామతో వెళ్ళి నరకాసురుణ్ణి వధించాడు. రామావతారములో ఈతనికి "దైవశక్తి" లేదు సుమా! ఏకపత్నీ వ్రతుడు సుమా!

విష్ణువు క్షీరసాగర మధనములో వచ్చిన "అమృతాన్ని" దేవతలకే ఇవ్వడానికి "మోహిని" అవతారము ఎత్తాడు. శివుడు మోహినిని మోహించాడు. మోహిని యోని నుండి కాక తొడనుండి "అయ్యప్ప" పుట్టాడు. ఇదో స్వలింగ సంపర్క (గే) కథ.

తమ భార్యల పాతివ్రత్య బలముతో రాక్షసులు దేవతలను ఓడించ సాగారు. విష్ణువు "బౌద్ధ" అవతారమెత్తి రాక్షసుల భార్యల పాతివ్రత్యాన్ని భంగపరచగా రాక్షసులు ఓడిపోయారు. రాక్షసుల భార్యలు "విష్ణువుని" శపించారు. అందుకే జగన్నాధుడు (కృష్ణుడు, విష్ణువు). పూరీలో తన చెల్లెలైన సుభద్రతో కాపురము చేస్తున్నాడు.

**పైన వ్రాసిన వన్నీ బ్రాహ్మణులు వ్రాసిన మత గ్రంథాలు నుండే తీసుకొనబడినవి.**

త్రిమూర్తులు కల్పిత దేవుళ్ళు. అందుకే వారికి మానవుల బుద్ధే అంటగట్టారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర్యాలకు అతీతులు కారు.

తల్లిని, చెల్లిని, కూతురును పెళ్ళి చేసుకొన్నవారు త్రిమూర్తులే దేవుళ్ళు కానప్పుడు, అవతారాలైన కృష్ణుడు, రాముడు దేవుళ్ళెలాగౌతారు? అసలు విష్ణువే కల్పితమైనప్పుడు, అవతారాలు కల్పితమే గదా!.

ఆర్యులు తమతో తెచ్చిన జానపద గాధలకు తమ ఊహలను జోడించి దేవుళ్ళను పుట్టించారు. రామాయణ, మహాభారతము వ్రాశారు.

చదువురాని స్త్రీలను, శూద్రులను భయపెట్టి వారి బుర్రలలోనికి ఈ కల్పితాలన్ని ఎక్కించారు. సుమారు 100-150 తరాలు గా స్త్రీలు, శూద్రులు చదువుకోలేదు. బ్రాహ్మణ పెత్తనము కొనసాగింది. నేటికీ కొనసాగుతూనే వుంది.

తల్లులు వారి చిన్నప్పుడు కథలుగా ఇవన్నీ విని, తాము కన్న పిల్లలకు ఇవే కథలు చెప్పుతూ వస్తున్నారు.

# అధ్యాయము - 9

**హిందుమతము - మరికొన్ని విషయాలు :-** బ్రహ్మ జీవిత కాలము (కోటి 55లక్షల, 52వేల కోట్లు సంIIలు) మన్వంతరము, యుగాలు గురించి వేరే చోటు చదివారు కదా!. భూమి పుట్టి 450 కోట్ల సంIIలు అని శాస్త్రజ్ఞులు అంచనా. హిందూ కాల చక్రము దీన్ని మించినది. క్రీస్తు పూర్వము గెలాక్సీల గురించి, విశ్వము గురించి ప్రపంచ ప్రజలకు తెలియదు. నక్షత్రాలు, సూర్యుడు, గ్రహాలు గురించి కొంత తెలుసు. యుగాలు, వాటి కాల పరిమితి పూర్తిగా ఊహాజనితము. ఇవి పుట్టించినవారు బ్రాహ్మణులు.

**ఋషులు** :- ప్రస్తుతము ఏడో మన్వంతరము నడుస్తున్నది. కాబట్టి ఏడుగురు ఋషులు (సప్తర్షులు) వున్నారు. వీరి జాబితా ఒక్కోమత గ్రంథములో ఒక్కోలాగుంటుంది.

**శతపత బ్రాహ్మణము** :- భరద్వాజ, గౌతమ, అత్రి, జమదగ్ని, కశ్యప, వశిష్ట, విశ్వామిత్ర.

**కృష్ణయజుర్వేదము** :- అంగీరస, గౌతమ, అత్రి, భృగు, కశ్యప, వశిష్ట, కూత్స.

**బృహతి సంహితము** :- అంగీరస, పులాహ, అత్రి, మారీచి, పులస్త్య, వశిష్ట, క్రతు.

**మహాభారతము** :- మరీచి, అత్రి, పులాహ, పులస్త్య, క్రతు, వశిష్ట, కశ్యప.

**సప్తాత బ్రాహ్మణము** :- గౌతమ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ట, కశ్యప, అత్రి, భరద్వాజ

పైన పేర్కొన్న జాబితాలో ఏది సరియైనది?

పైన పేర్కొన్న ఋషులలో కొందరి గురించి -

**(1) అత్రి - అనసూయ :-** త్రిమూర్తులు అనసూయను నగ్నంగా చూడాలనుకున్నారు. అనసూయ వారిని చిన్న పిల్లలుగా మార్చివేసి, నగ్నంగా వారికి భోజనము పెట్టింది.

**(2) అగస్త్యుడు - లోపాముద్ర :-** లోపాముద్రను అగస్త్యుడే సృష్టించాడు. వింధ్య పర్వతాలు పెరిగిపోతూ సూర్య గమనాన్ని అడ్డుకోబోతుండగా, అగస్త్యుడు ఆ దారంట వెళ్తూ వింధ్య పర్వతాలకు కనిపించాడు. పర్వతాలు వంగి అగస్త్యునికి మ్రొక్కాయి. తను తిరిగి వచ్చే వరకు అలాగే వుండమని పర్వతాలకు చెప్పాడు. కాబట్టి ఆ పర్వతాలు సూర్యుని రథాలను అడ్డుకోలేకపోయాయి.

దేవతలు, రాక్షసులు యుద్ధము చేస్తుండగా రాక్షసులు సముద్రములో దాగుండిపోయారు. అగస్త్యుడు సముద్రములలోని నీరు త్రాగేశాడు. రాక్షసులు బయటపడ్డారు. దేవతలు గెలిచారు. అగస్త్యుడు సముద్ర నీటిని మూత్రముగా బయటకు వదిలివేశాడు. అందుకే సముద్రపు నీరు ఉప్పగా వుంటుంది.

**(3) భృగువు - ఖ్యాతి :-** ఇతనికి వేరే భార్యలు కూడా వున్నారు. ఈతని పాదము క్రింద మూడో కన్ను వుండబట్టి చాలా శక్తిమంతుడైన ఋషి, విష్ణువు ఛాతీపై తన్నాడు. విష్ణువు యుక్తిగా, భృగువు పాదాన్ని వత్తుతూ మూడో కన్నును చిదిమేశాడు. అతని శక్తి తగ్గిపోయింది. ఈతని కూతురు "భార్గవి" నారాయణ్ణున్ని (విష్ణువు)ని పెళ్ళాడింది. (లక్ష్మికి సవతి) భృగువు - ఊసనలకు శుక్రుడు పుట్టాడు. శుక్రుడు రాక్షసుల గురువు.

**(4) జమదగ్ని - రేణుక :-** వీరికి (జమదగ్ని భృగు వంశీయుడు) ఆరో అవతారమైన పరశురాముడు పుట్టాడు.

భర్తకు నీరు తెస్తుండగా సూర్యుని వేడికి రేణుక పాదాలు మండాయి. శరీరము కందిపోయింది. జమదగ్నికి కోపమొచ్చి తన విల్లుకి బాణము సంధించి సూర్యున్ని కొట్టబోయాడు. సూర్యుడు జడిసిపోయి జమదగ్నికి మ్రొక్కి, తన వేడిమి ద్వారా

బాధపడిన రేణుకకు "గొడుగు" "చెప్పులు" ఇచ్చాడు. అంతవరకు భూమిపై గొడుగు, చెప్పులు లేవు.

**(5) వశిష్టుడు - అరుంధతి :-** వేమన పద్యము బహుచక్కగా వీరి గురించి వర్ణించింది.

గీ॥ తల్లి యూర్వశిలంజె - తనయాలి మాదిగె
తాను బ్రాహ్మడయ్యె ధరవశిష్ఠు
తపము చే విప్రుండు తర్కింప కులమేది
విశ్వధాభిరామ - వినురవేమ.

తల్లి యూర్వశి దేవవేశ్య(సానిది) తన భార్య అరుంధతి మాదిగది. (పంచమ కులము) వశిష్టుడనే ఋషి బ్రాహ్మణుడు. మరి వశిష్ఠ కులమైన బ్రాహ్మణులు ఎంత గొప్పవారో?

సప్తర్షుల భార్యలందరిలోకి "అరుంధతి" గొప్ప పతివ్రత.

**(6) భరద్వాజుడు - సుశీల :-** భరద్వాజుడు అంగీరసుని వారసుడు. ఈతని కొడుకు బృహస్పతి దేవతలకు గురువు. ఈతని వంశీయుడే భారతములోని "ద్రోణుడు".

**(7) గౌతముడు - అహల్య :-** అహల్య స్వయంవరంలో గౌతమున్ని వరించింది. ఇంద్రున్ని వరించలేదు. అందుకే ఇంద్రుడు ఏలాగైనా అహల్యను అనుభవించాలనుకున్నాడు. కోడికూతకు లేచి గౌతముడు నదీ స్నానానికి వెళ్తాడు. ఇంద్రుడు కోడిగా మారి మాములు సమయము కన్నా ముందే కూస్తాడు. గౌతముడు లేచి బయటకు పోగానే ఇంద్రుడు గౌతముని రూపములోనికి దూరి అహల్యను అనుభవిస్తాడు. తిరిగివచ్చిన గౌతముడు విషయము గ్రహించి అహల్యను రాయిగా మారమని శపిస్తాడు. ఇంద్రుని వంటినిండా "యోనులు" వుండాలని శాపమిస్తాడు. బ్రహ్మ ఇంద్రుని వంటి మీద "యోనులను" నెమలి ఈకలుగా మారుస్తాడు. రాముడు కాలు తగిలి రాయిగా వున్న అహల్య తిరిగి మనిషిగా మారుతుంది.

మిత్ర, వరుణుడు ఊర్వశిని చూసి స్కలించగా. వారిరువురి వీర్యము ఒక కుండలో పడుతుంది. అందులో నుండి వశిష్టుడు, అగస్త్యుడు పుడతారు.

ఈ ఋషులు వేల సం॥ముల బ్రతికారట. ఆఖరికి వీరు సప్తర్షి మండలములోని నక్షత్రాలు గా మారారట. సప్తర్షి మండలాన్ని "గ్రేట్ బేర్"గా ఇంగ్లీషులో వ్యవహరిస్తారు. ఇందులోని నక్షత్రాలు మన భూమికి 50 నుండి 110 కాంతి సం॥ల దూరములోనున్నాయి. కొన్ని సూర్యుని కన్నా పెద్దవి. కొన్ని కోట్ల సం॥లు క్రితము ఏర్పడ్డాయి.

**వాల్మీకి :-** ఈతని అసలు పేరు రత్నాకరుడు. బ్రాహ్మణుడు చిన్నప్పుడు తప్పిపోయి వేటగాళ్ళ చేతిలో పడ్డాడు. తపస్సు చేస్తుండగా అతని చుట్టూ చెదలపుట్ట పెరిగి అందులో ఉండి కూడా తపస్సు చేయసాగాడు. బయటికి వచ్చాక వాల్మీకము (చెదలపుట్ట) నుండి వచ్చాడు కనుక వాల్మీకి అయ్యాడు.

ఇంకో కథ - వరుణుడి, వీర్యము చెదలపుట్టపై పడగా అందులోనుండి ఒక బాలుడు పుట్టాడు. అందుకే వాల్మీకి అయ్యాడు. ఏమిటో?

**స్వలింగ సంపర్కము :-** విష్ణువు మోహిని అవతారమెత్తగా శివుడు కామించి రతిసల్పారు. అయ్యప్ప విష్ణువు తొడ నుండి పుట్టాడు. యోని నుండి కాదు. మిత్ర, వరుణుడు దేవుళ్ళు. స్వలింగసంపర్కులు ("గే"లు) అమవాస్యనాడు, పున్నమి నాడు సంభోగించగా చంద్రుడు రెండు భాగాలుగా పుట్టాడట. ఏమిటో?

సూర్యవంశీయుడైన దిలీప మహారాజుకి ఇద్దరు రాణులు. పిల్లలు పుట్టకుండానే రాజు చనిపోయాడు. స్వలింగ సంపర్కమునకు అలవాటు పడిన శివుడు - రాణులు ఇద్దరూ సంభోగించమని సెలివిచ్చాడు. ఇద్దరూ రాణులు (లెస్బియన్స్) సంభోగించగా "భగీరథుడు" పుట్టాడు. ఏమిటో?

అంటే "గే" "లెస్బియన్' సంపర్కాలు హిందూ మతానికి కొత్త కాదు. అంటే బ్రాహ్మణులకు కొత్తకాదు. వారే కదా గ్రంథాలు రచించారు. అన్నీ వేదాలులో ఉన్నాయష!.

**భగవద్గీత :-** అసలు మహాభారతములో లేదు. నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడలు అనువదించిన భారతములో ఇది లేదు. క్రీ॥శ॥ 1000 సం॥లో భగవద్గీత ఒక రాజస్తాన్‌లో నున్న బ్రాహ్మణుని చే రచించబడినది. భగవద్గీత ప్రకారము అన్ని పనులూ దేవుడే మానవులతో చేయిస్తాడు. కాబట్టి ఎవరూ 'పాపి' కారు.

**గోమాత :-** యజ్ఞయాగాదులలో పశువును బలి ఇచ్చి, ఆ పశుమాంసము పూజార్లు (బ్రాహ్మణులు) తినేవారు. జైనుడు, బుద్ధుడు – బ్రాహ్మణ యుగములో (క్రీస్తు పూర్వము 500 సం॥లు) వారి మతాలు స్థాపించగా అవి విస్తరించసాగాయి. "అహింస" వారి సిద్ధాంతము. దీనికి ప్రజలు ఆకర్షితులయినారు. బ్రాహ్మణులు పశుమాంస తినడము ఆపివేసి – శాఖాహారులు గా మారారు. కాని ఉత్తర భారతదేశములో మాంసము తినే బ్రాహ్మణులు ఇంకా వున్నారు సుమా!. ఈ మార్పుతో బ్రాహ్మణుల ముఖ్య ఆహారము ఆవు పాలు, పెరుగు, వెన్న, నేయి మొదలగు పాల వుత్పత్తులతో ప్రభావితమైంది. దానికి తోడు ఆవు మూత్రము మందుగాను, పేడ వంట చెరకు గాను వుపయోగించారు. స్త్రీ, పురుషుల "అక్రమ సంబంధ" పాప ప్రాయశ్చిత్తానికి ఆవు మూత్రము త్రాగాలి. పేడ తినాలి అని శాస్త్రాలు చెప్పుతున్నాయి. కాబట్టి ఆవు "గోమాత" అయ్యింది. "గోఘ్నులు" (ఆవును వధింప చేయువారు) "గోమాత"కి బిడ్డలయ్యారు.

ప్రపంచమంతా ఆవులున్నాయి. ఒక హిందువులలో బ్రాహ్మణులకు మాత్రమే "గోమాత" తల్లి అయింది. కాబట్టి గోవధ చేయకూడదు. గోదానము బ్రాహ్మణుడికే ఇవ్వాలి. గోవును చంపితే బ్రాహ్మణున్ని చంపినట్టే లెక్క!.

అయితే గోవులను భారతదేశములో ఎవరు పెంచుతున్నారు. శూద్రులు కదా!. వారు పాలను 7 లేక 8 ఈతలు వరకు ఆవుల నుండి పిండి జీవనోపాధిగా బ్రతుకుతున్నారు. తర్వాత పాల దిగుబడి తగ్గిపోగా ఆవులను సంతలలో అమ్ముతారు. మరి బ్రాహ్మణులు ఈ ఆవులన్నిటినీ కొని వేసి అవి చచ్చేవరకు పోషించాలి. బీదలైన శూద్రులకు ఈ బాధ్యత అప్పజెప్పకూడదు.

ఆర్యులు మొదట్లో పశుపాలకులు. పశువుల గురించే వారి మధ్య యుద్ధాలు జరిగాయి.

గేదెలు కూడా పాలు ఇస్తాయి. గేదె పాలుకు మంచి గిరాకీ వుంది. వీటిని కూడా 7 లేక 8 ఈతలు వరకూ వాడుకొని వాటిని అమ్మేస్తారు. ఇవి ఆవు కన్నా ఎక్కువ పాలిస్తాయి. ఇవి నల్లగా వుంటాయి. ఇవి కూడా సాధుజంతువులే కదా! మరి వీటిని వధించి మాంసము తింటే తప్పులేదా? దీనినే ధ్వంధ్వ నీతి అంటారు.

పూజింపదగిన "గోమాతలు" రోడ్లపైన చెత్త తింటే తప్పులేదు. బజార్లవెంబడి తిరిగి కాయగూరలు, ఆకుకూరలు గుంజుకొని తింటాయి. మరి ఈ విషయము "గో సంరక్షకులకు" పట్టదా?

ప్రభుత్వమే వీటిని సంరక్షించాలట. సామాన్యుడు చెల్లించే పన్నుల డబ్బు వీటి క్రింద ఖర్చు చేయాలంట!. వీటి సంరక్షణకు, గో సంరక్షకుల నుండి పన్నులు వసూలు చేయాలి.

భారతదేశములో ఆవులు తక్కువ పాలిస్తాయి. కాబట్టి ప్రభుత్వము వారు మ్లేచ్ఛులు, అప్రాచ్యుల దేశముల నుండి ఎక్కువ పాలిచ్చే ఆంబోతులను, వాటి వీర్యాన్ని దిగుమతి చేసుకొని మన దేశ ఆవులకు సంక్రమణము చేసి ఎక్కువ పాలిచ్చే "సంకరజాతి" ఆవులను ఉత్పత్తి చేస్తున్నారు. ఇది చాలా తప్పు కదా! ఇది మన "గోమాత"కి అవమానము కదా! గోమాత బిడ్డలు ఈ అవమానము ఏలాగు భరిస్తున్నారు.

**సంస్కృతము :-** ఆర్యులు పర్షియా నుండి వస్తూ ఈ భాషను భారతదేశములోనికి తెచ్చారు. వారు గురుముఖముగా ఈ భాషను అభ్యసించారు. వేదాలు ఈ భాషలోనే వ్రాసి అభివృద్ధిపరచారు. దీనిని దేవభాష అని అన్నారు.

సంస్కృతము చాలా గొప్ప భాష అన్న విషయములో ఎటువంటి అతిశయోక్తి కాదు. కానీ ఈ భాషను అగ్రవర్ణాలకు మాత్రమే పరిమితము చేసి 90 శాతం ప్రజలకు అర్థము కాకుండా వుంచారు. దీనిలో బ్రాహ్మణుల స్వార్థం చాలా ఎక్కువగా

వుంది. ప్రజలకు ప్రయోజనకరమైన విషయాలు సంస్కృతములో రహస్యముగా నుంచి ఆ విషయాలు ప్రజలకు అందుబాటులో లేకుండా వుంచారు. ఉదాహరణకు – ఆయుర్వేద వైద్యము బ్రాహ్మణులకే తెలుసు. కాలక్రమేణ ఈ గొప్ప వైద్యము మరుగున పడింది.

అందుకే నేటికీ బ్రాహ్మణులలో కూడా చాలా మందికి ఈ భాష తెలియక అనేక విజ్ఞాన విషయములు మరుగున పడ్డాయి. అయినా సరే సిగ్గులేకుండా "అన్నీ వేదాలలో ఉన్నాయష" అంటారు.

సంస్కృతములో భాషాసాహిత్యాలు చాలా గొప్పవన్న విషయము నిర్వివాదాంశము. కానీ ఏమి ప్రయోజనము. ప్రజలకు అందుబాటులో లేకుండా చేసి ఈ భాషను మృతభాషగా చేశారు. స్వార్థము ఎంత ఘోరమైనది? దేశమును అభివృద్ధి చేయవలసిన భాష మృతమైంది.

**తులసి మొక్క :-** విష్ణువు వరమివ్వగా, భూమిపై అవతారమెత్తిన లక్ష్మి – తులసిమొక్కగా పూజలు అందుకుంటున్నది.

**చెట్లకు పెళ్ళి :-** బుద్ధుడు రావి చెట్టు క్రింద జ్ఞానోదయము పొందాడు. వేపచెట్టు హిందువులకు పూజనీయమైనది. ఈ రెండు చెట్లు ఒకే దగ్గర మొలిస్తే వాటికి పెళ్ళి చేస్తారు. ఇది మత సామరస్యము.

**కప్పల పెళ్ళి :-** కప్పలకి పెళ్ళి చేస్తే వర్షాలు పడ్తాయి.

**గాడిదల పెళ్ళి :-** గాడిదలకు పెళ్ళి చేస్తే కూడా వర్షాలు పడ్తాయి.

**విగ్రహాలకు స్నానము :-** ఇదో మూఢత్వము. అర్ధరహిత ఆచారము.

సూర్యగ్రహణమప్పుడు గుడిలోనున్న దేవుళ్ళకు ముప్పు ఏర్పడుతుంది. కాబట్టి ఆలయాలు మూసివేస్తారు.

**ప్రవేశము నిషేధం :-** కొన్ని దేవాలయాలలో బహిష్టు అయిన స్త్రీలను రానివ్వరు. కొన్ని దేవాలయాలలో పూర్తిగా స్త్రీ ల ప్రవేశం నిషేదం.